
తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
జనంసాక్షి
www.janamsakshi.org
ఖమ్మం - నల్లగొండ
భద్రాద్రి కొత్తగూడెం సూర్యాపేట
యాద్రాద్రి భువనగిరి
శుక్రవారం
28 ఆగష్టు 2026
పేజీలు : 8




# కొలువుల పేరుతో లక్షల వసూళ్ల ఆరోపణలు

- పీఏ చుట్టూ ఆరోపణల వలయం..
- రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వసూళ్లు చేశారంటూ ఆరోపణలు..
- రైల్వే ఉద్యోగం పేరుతో మరో రూ.10 లక్షల వ్యవహారం?




**భద్రాచలం ఆగస్టు 27 (జనంసాక్షి) :** భద్రాచలం నియోజకవర్గంలో ఉద్యోగాల పేరుతో సాగినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న వసూళ్ల వ్యవహారం ఇప్పుడు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఎమ్మెల్యే వ్యక్తిగత సహాయకుడు (పీఏ) కేంద్రంగా ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ పలువురు నిరుద్యోగులు, వారి కుటుంబ సభ్యుల నుంచి భారీగా నగదు తీసుకున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఒక్కొక్కరి నుంచి రూ.5 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు వసూలు చేసినట్లు బాధితుల వర్గాల్లో ప్రచారం జరుగుతుండగా, మొత్తం లావాదేవీలు కోట్ల రూపాయల్లో ఉన్నాయనే ఆరోపణలు కలకలం రేపుతున్నాయి. అయితే ఈ ఆరోపణల్లో వాస్తవమెంతన్నది అధికారిక విచారణలో తేలాల్సి ఉంది.

**ఉద్యోగం వస్తుందన్న ఆశతో అప్పులు**

ఉద్యోగం కోసం ఎదురుచూస్తున్న నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకుని ప్రభుత్వరంగ సంస్థలు, ప్రైవేట్ కంపెనీల్లో కొలువులు ఇప్పిస్తామని కొందరు నమ్మించినట్లు సమాచారం. మంచి వేతనంతో ఉద్యోగం వస్తుందన్న ఆశతో పలువురు అప్పులు చేసి మరీ డబ్బులు సమకూర్చినట్లు బాధితుల వర్గాలు చెబుతున్నాయి. కొంతకాలం పాటు ఉద్యోగ నియామకం త్వరలో పూర్తవుతుందని నమ్మించినప్పటికీ కొలువులు రాకపోవడంతో బాధితులు ఆందోళనకు గురైనట్లు తెలుస్తోంది.

**- క్యాంపు కార్యాలయం పేరుతో పైరవీలు?**

ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయాన్ని కేంద్రంగా చేసుకుని కొందరు వ్యక్తులు నిరుద్యోగులతో పరిచయాలు పెంచుకుని ఉద్యోగాల పేరుతో పైరవీలు సాగించినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎమ్మెల్యే పీఏగా పనిచేస్తున్న వ్యక్తి పరిచయాలు, హోదాను చూపిస్తూ ఉద్యోగాలు ఇప్పిస్తామని నమ్మించినట్లు ప్రచారం జరుగుతోంది. దీంతో కొందరు తమ డబ్బులు తిరిగి ఇవ్వాలని ఒత్తిడి చేసినట్లు సమాచారం.ప్రభుత్వ ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్, పరీక్షలు, మెరిట్, నియామక ప్రక్రియ వంటి నిబంధనలు ఉన్నప్పటికీ డబ్బులు చెల్లిస్తే ఉద్యోగం ఇప్పిస్తామంటూ నమ్మించినట్లు వస్తున్న ఆరోపణలు మరింత చర్చకు దారితీస్తున్నాయి. కొందరికి నియామక పత్రాల పేరుతో పత్రాలు ఇచ్చినట్లు కూడా ప్రచారం జరుగుతోంది. అవి అసలైనవా? నకిలీవా? అన్నది తేలాల్సి ఉంది.

**- రైల్వే కొలువు పేరుతో మరో రూ.10 లక్షలు?**

ఇదే వ్యవహారంలో కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని రైల్వే శాఖలో ఉద్యోగం ఇప్పిస్తామంటూ మరో వ్యక్తి ద్వారా రూ.10 లక్షల వరకు వసూలు చేశారనే ఆరోపణ కూడా వినిపిస్తోంది. ఈ వ్యవహారంలోనూ పీఏ మధ్యవర్తిగా వ్యవహరించినట్లు బాధితుల వర్గాల్లో ప్రచారం సాగుతోంది. రైల్వే ఉద్యోగాల పేరుతో జరిగినట్లు చెబుతున్న లావాదేవీలపైనా సమగ్ర విచారణ జరపాలని పలువురు కోరుతున్నారు.

**- ఎమ్మెల్యేకు తెలిసే జరిగిందా?**

పీఏ చుట్టూ వరుసగా ఆరోపణలు వెల్లువెత్తుతున్న నేపథ్యంలో ఈ వ్యవహారం ఎమ్మెల్యేకు తెలిసే జరిగిందా? లేక ఆయన పేరు, హోదాను కొందరు వ్యక్తులు ఆయనకు తెలియకుండానే ఉపయోగించుకున్నారా? అన్న ప్రశ్నలు స్థానికంగా చర్చకు వస్తున్నాయి. క్యాంపు కార్యాలయం పేరుతో ఉద్యోగాల వ్యవహారం సాగినట్లు ఆరోపణలు రావడంతో దీనిపై స్పష్టత రావాలంటే సమగ్ర విచారణ అవసరమని పలువురు అభిప్రాయపడుతున్నారు.

అయితే ప్రస్తుతం బహిరంగంగా అందుబాటులో ఉన్న సమాచారంతో ఈ ఆరోపణల్లో ఎమ్మెల్యే పాత్ర ఉందని నిర్ధారించడానికి ఆధారాలు లేవు. ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తుల వివరణ కూడా వెలువడాల్సి ఉంది.

**ఆధారాలు బయటకు వస్తే..?**

ఉద్యోగాల కోసం డబ్బులు చెల్లించినట్లు చెబుతున్న కొందరు బాధితుల వద్ద నగదు చెల్లింపులు, బ్యాంకు లావాదేవీలు, వాట్సాప్ సంభాషణలు, నియామక పత్రాలు తదితర ఆధారాలు ఉన్నట్లు సమాచారం. బాధితులు అధికారికంగా పోలీసులకు ఫిర్యాదు చేస్తే వ్యవహారానికి సంబంధించిన మరిన్ని వివరాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉంది. ఎంతమంది నుంచి ఎంత మొత్తం వసూలు చేశారు? ఎవరు మధ్యవర్తులుగా వ్యవహరించారు? డబ్బులు ఎవరికి చేరాయి? ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం పేరును ఎలా ఉపయోగించారు? నియామక పత్రాలు నిజమైనవేనా? వంటి అంశాలపై దర్యాప్తు జరగాల్సిన అవసరం ఉందని బాధితుల వర్గాలు కోరుతున్నాయి. ఆరోపణలు నిజమని తేలితే బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు తమ డబ్బులు తిరిగి ఇప్పించాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

## రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

### మాజీ మంత్రి పువ్వాడ



**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 27 (జనం సాక్షి )** రాఖీ పౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకుని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమి సోదర సోదరీమణుల మధ్య ఉన్న ప్రేమ, ఆప్యాయత, అనుబంధానికి ప్రతీకగా నిలుస్తుందని కుటుంబ విలువలను, సోదర సోదరీమణుల మధ్య అనుబంధాన్ని మరింత బలోపేతం చేసే పవిత్రమైన పండుగ అని అన్నారు.ఈ పర్వదినం ప్రతి కుటుంబంలో సంతోషం, శాంతి, సౌభ్రాతృత్వం వెల్లివిరియాలని, ప్రజలందరూ ఆయురారోగ్యాలతో, ఆనందంగా జీవించాలని సోదర సోదరీమణుల మధ్య ప్రేమానురాగాలు పెంపొందాలని మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ఆకాంక్షించారు.

## రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపినఎంపీ వద్దిరాజు



**ఖమ్మం కార్పొరేషన్,ఆగస్టు 27 (జనంసాక్షి):** తెలంగాణ సోదర సోదరీమణులకు ఎంపీ వద్దిరాజు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పౌర్ణమి (శ్రావణ పున్నమి) సందర్భంగా అక్కా తమ్ముళ్లు, అన్నాచెల్లెళ్లకు బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ లీడర్ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.ప్రతి ఏటా శ్రావణ మాసంలో వచ్చే పౌర్ణమి రోజున ఈ పండుగను దేశమంతటా ఘనంగా జరుపుకుంటారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.రాఖీ పౌర్ణమి అనేది అక్కాతమ్ముళ్లు, అన్నాచెల్లెళ్ల మధ్య ఉన్న ప్రేమానురాగాలు, రక్షణకు ప్రతీకగా జరుపుకునే అత్యంత ముఖ్యమైన హైందవ పండుగ అని ఎంపీ రవిచంద్ర చెప్పారు.సోదరీమణులు తమ సోదరుల నుదుట బొట్టు పెట్టి కుడి చేతి మణికట్టుకు రాఖీని (రక్షా సూత్రాన్ని) కట్టి వారి శ్రేయస్సు, ఆయురారోగ్యాలు బాగుండాలని భగవంతున్ని ప్రార్థిస్తారన్నారు.ఈ సందర్భంగా సోదరులు తమ అక్కాచెల్లెళ్లకు జీవితాంతం తోడుగా ఉంటామని అభయమిస్తూ పరస్పరం మిఠాయిలు తినిపించుకుంటారని, బహుమతులు, కానుకలు అందజేస్తారని ఎంపీ రవిచంద్ర వివరించారు.ఈ పండుగ కేవలం రక్తసంబంధీకులకు మాత్రమే కాకుండా సమాజంలో సోదర,పరస్పర రక్షణ భావాన్ని పెంపొందించడానికి ప్రతీకగా నిలుస్తుందన్నారు.రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) పర్వదినం సందర్భంగా తెలంగాణ సోదర సోదరీమణులకు ఎంపీ వద్దిరాజు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

ఏజెన్సీ గిరిజన కుటుంబాలకు

## రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు

### ఐటీడీఏ పీవో బి రాహుల్..



**భద్రాచలం ఆగస్టు 27 (జనంసాక్షి)** అన్నాచెల్లెళ్ల ఆత్మీయ అనుబంధానికి ప్రతీకగా నిలిచే రాఖీ పౌర్ణమి పండుగను ఏజెన్సీ ప్రాంత గిరిజన కుటుంబాలు ఆనందోత్సాహాలతో జరుపుకోవాలని ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ ఆకాంక్షించారు. ఈ సందర్భంగా ఏజెన్సీలోని మారుమూల ఆదివాసీ గ్రామాల్లో నివసిస్తున్న గిరిజన కుటుంబాలతో పాటు విద్యార్థినీ, విద్యార్థులకు ఆయన రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్ల మధ్య ప్రేమ, ఆప్యాయత, అనుబంధాలకు ప్రతీకగా నిలుస్తుందని పేర్కొన్నారు. “నాకు నీవు రక్ష.. నీకు నేను రక్ష.. ఇద్దరం కలిసి దేశానికి రక్ష” అనే సోదర, సోదరీ భావంతో ప్రతి ఒక్కరూ రాఖీ పండుగను సంతోషంగా జరుపుకోవాలని రాహుల్ పిలుపునిచ్చారు. గిరిజన కుటుంబాల జీవితాల్లో రాఖీ పౌర్ణమి సంతోషాన్ని, సోదరభావాన్ని మరింత పెంపొందించాలని ఆయన ఆకాంక్షించారు.

# కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని ప్రకటించిన ఎమ్మెల్యే కుంభం



**వలిగొండ, ఆగస్టు 27( జనంసాక్షి )**
వలిగొండ మండల కాంగ్రెస్ పార్టీ నూతన కార్యవర్గాన్ని గురువారం భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్ రెడ్డి ప్రకటించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షునిగా వలిగొండకు చెందిన బత్తిని సహదేవ్ గౌడ్, ఉపాధ్యక్షులుగా శనిగారపు పాండు, గంధ మల్ల నరసింహ, ప్రధాన కార్యదర్శిగా మామిడి సత్తిరెడ్డి ,దండెం సరిత, గంగాపురం సాయిబాబా ,నూదిని రాజశేఖర్ రెడ్డి, అదేవిధంగా కార్యదర్శులుగా బుగ్గ వెంకటేశం, గంగాపురం సంధ్యారాణి ,కసర బోయిన నరసింహ, బండారి అనిత, కళ్లెం బాల శంకర్ గౌడ్ ,రేకల బాలరాజ్ గౌడ్, ప్రకటించగా ఎక్స్ క్యూట్ మెంబర్లుగా ఏర్పుల యాదయ్య, ఎమ్మే నవ్య ,ఎడవెల్లి మల్లేశం, జక్కుల శోభ రాణి ,దండ మల్లికార్జున్ ,మాదాసు రాణి ,కేసరి మహేందర్ రెడ్డి, కందుల నరేష్ ,కళ్లెం రాములు ను ప్రకటించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన మండల కాంగ్రెస్ పార్టీ కార్యవర్గం నిరంతరం ప్రజల మధ్య ఉంటూ సమస్యల పరిష్కారం కోసం పాటుపడాలని సూచించారు ప్రజా ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ పథకాలను ఎప్పటికప్పుడు ప్రజల్లోకి తీసుకెళ్లి వివరించాలని అన్నారు రాష్ట్రంలో రేవంత్ సర్కార్ ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యంగా పనిచేస్తుందని పేదలకు అందుతున్న ప్రతి పథకాన్ని విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు గత ప్రభుత్వం సాగునీటి కాలువల విషయంలో నిర్లక్ష్యం చేసిందని కానీ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నియోజకవర్గ వ్యాప్తంగా సాగునీటి కాలువలకు ప్రాధాన్యతనిస్తూ కోట్లాది రూపాయలను నిధులు మంజూరు చేసి సాగునీరు అందించే ప్రక్రియను చేపట్టిందని అన్నారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ నియామక పత్రాన్ని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సహదేవ్ కు ఎమ్మెల్యే చేతుల మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు పాశం సత్తిరెడ్డి, మాజీ ఎంపీపీ నూతి రమేష్ రాజు , సింగిల్ విండో చైర్మన్ గరిసె రవి, ముద్దాపురం గ్రామాల సర్పంచులు కుంభం వెంకట్ పాపిరెడ్డి ,సామ రామ్ రెడ్డి ,కాంగ్రెస్ పార్టీ నాయకులు బత్తిని లింగయ్య, గంగాపురం సతీష్, రైతు సంఘం నాయకులు నరేందర్ రెడ్డి ,గూడూరు శ్రీధర్ రెడ్డి , గుండు దానయ్య, వెంకన్న గౌడ్, మత్స్యగిరి గుట్ట డైరెక్టర్ రాధారపు రమేష్ ,ఎమ్మే లింగస్వామి, ఉలిపే మల్లేశం.



## ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలి

**సూర్యాపేట (జనంసాక్షి):**
యాదాద్రి భువనగిరి జిల్లాలో జరగనున్న అఖిల భారత యువజన సమాఖ్య తెలంగాణ రాష్ట్ర మూడవ మహాసభలను జయప్రదం చేయాలని సీపీఐ పట్టణ కార్యదర్శి బూర వెంకటేశ్వర్లు పిలుపునిచ్చారు.గురువారం జిల్లా కేంద్రంలో జరిగిన అఖిల భారత యువజన సమాఖ్య పట్టణ కౌన్సిల్ సమావేశంకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.దేశ భవిష్యత్తు యువత చేతుల్లోనే ఉందని అన్నారు.యువత ఎదుర్కొంటున్న నిరుద్యోగం, ఉపాధి అవకాశాల కొరత, విద్యా సమస్యలు, ప్రభుత్వ ఉద్యోగాల భర్తీ, సామాజిక న్యాయం, యువత హక్కులు వంటి అనేక సమస్యలపై మహాసభల్లో సమగ్రంగా చర్చించి భవిష్యత్ ఉద్యమ కార్యాచరణను రూపొందించనున్నట్లు తెలిపారు.ప్రభుత్వ రంగాన్ని బలోపేతం చేయడంతో పాటు ఖాళీగా ఉన్న ప్రభుత్వ ఉద్యోగాలను భర్తీ చేయాలని పేర్కొన్నారు.యువతకు నాణ్యమైన విద్య, ఉపాధి అవకాశాలు కల్పించాలని డిమాండ్ చేశారు.అఖిల భారత యువజన సమాఖ్య పట్టణ అధ్యక్ష, కార్యదర్శులు బూర సైదులు, ఎడెల్లి శ్రీకాంత్ మాట్లాడుతూ యువత సమస్యలపై నిరంతరం పోరాడుతున్న ఏఐవైఎఫ్ రాష్ట్ర మూడవ మహాసభలు భవిష్యత్ యువజన ఉద్యమానికి నూతన దిశానిర్దేశం చేసే వేదికగా నిలవనున్నాయని పేర్కొన్నారు.ఈ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. కుక్కడపు శౌరి అధ్యక్షతన జరిగిన ఈ సమావేశం లో కామేష్, రెడ్డిమల్ల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## కలెక్టరేట్ ఎదుట ధర్నాకు తరలిన ఉపాధ్యాయులు



**నేరేడుచర్ల ఆగస్టు 27 (జనంసాక్షి):** రాష్ట్ర ఉద్యోగ, ఉపాధ్యాయ సంఘాల సంయుక్త కార్యాచరణ సంఘం పిలుపు మేరకు పెండింగ్ లో ఉన్న అనేక సమస్యల పరిష్కారం కోసం దశలవారీ పోరాటంలో భాగంగా గురువారం సూర్యాపేట జిల్లా కలెక్టరేట్ ఎదుట జరిగే ధర్నా కార్యక్రమానికి నేరేడుచర్ల నుండి ఉపాధ్యాయులు తరలివెళ్లారు. జిల్లా ఉపాధ్యాయ సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ వాహనాలకు జెండా ఊపి ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రెండవ వేతన సవరణను వెంటనే అమలు చేయాలని,ఆరు కరువు భత్యాలను వెంటనే విడుదల చేయాలన్నారు.విరాళాల ఆధారిత పింఛను విధానాన్ని రద్దు చేసి పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలన్నారు. ప్రతి నెల పదవీ విరమణ అయ్యే వారికి ఇచ్చే బకాయిలు రెండు వేల కోట్లు కాకుండా మూడు వేల కోట్ల వరకు చెల్లించాలన్నారు. నూతన ఉద్యోగుల ఆరోగ్య పథకాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యాయ సంఘం నాయకులు ఆర్. శ్రీనయ్య,ఎన్. నరసింహారావు,సిహెచ్. వెంకటేశ్వరరావు,కె. వెంకటేశ్వరరావు,కె.అన్నపూర్ణ, వి.నాగవాణి,ఆర్.మానస,పి. వెంకటేశ్వర్లు,టి.రాఘవరెడ్డి,వి. శ్రీనివాసరావు,ఎ.అశోక్ కుమార్, కె.గురవయ్య,కెఆర్.శ్యామ్ సుందర్ రావు,కె.ఎల్లయ్య,ఎన్. గోపి,బి.అక్కయ్య బాబు తదితరులు పాల్గొన్నారు.

## నేతాజీ యువజన సంఘం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కీర్తి సంజీవ



**భూదాన్ పోచంపల్లి,ఆగస్టు 27(జనంసాక్షి) :**
పట్టణంలోని నేతాజీ యువజన సంఘం గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా కీర్తి సంజీవ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. రానున్న గణేష్ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేం దుకు కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేయ నున్నట్లు తెలిపారు. అధ్యక్షుడిగా సంజీవ ఎన్నిక కావడంతో యువజన సంఘం సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

## 67 మంది విద్యార్థినులు ఎన్‌సీసీకి ఎంపిక



**భూదాన్ పోచంపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి):**
మండలంలోని దేశ్‌ముఖ్‌లో తెలంగాణ సోషల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ ఆర్మ్డ్ ఫోర్సెస్ ప్రిపరేటరీ డిగ్రీ కాలేజీలో ఎన్‌సీసీ నమోదు 2026 ఎంపికలు నిర్వహించారు. 7 (టి) గర్ల్స్ బెటాలియన్ ఎన్‌సీసీ సిబ్బంది ఆధ్వర్యంలో జరిగిన ఎంపికల్లో మొదటి సంవత్సరం విద్యార్థినులు పాల్గొన్నారు. శారీరక దారుఢ్యం, క్రీడలు, యోగా, సాంస్కృతిక కార్యక్రమాలు, డ్రిల్ తదితర అంశాల్లో ప్రతిభను పరిశీలించి 67 మంది విద్యార్థినులను ఎన్‌సీసీకి ఎంపిక చేశారు. ఎంపిక ప్రక్రియను సుబేదార్ రఘ్‌పాల్ సింగ్, హవల్దార్ మనీష్ రిచారియా నిర్వహించగా, ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ డాక్టర్ పి. రూప పర్యవేక్షించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ కె. శ్రీలత, డైరెక్టర్ కల్నల్ రాజా దత్తా ఎంపికైన విద్యార్థినులను అభినందించారు.

## పాత పీహెచ్‌సీ స్థలంలో సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలి




**నేరేడుచర్ల ఆగస్టు 27 (జనంసాక్షి):**
పట్టణంలోని విద్యానగర్ ప్రాంత ప్రజలకు వైద్య సేవలు అందుబాటులోకి తీసుకురావడానికి పాత పీహెచ్‌సీ స్థలంలో సబ్ సెంటర్ ఏర్పాటు చేయాలని స్థానికులు కోరారు.గురువారం విద్యానగర్ కాలనీలో వైద్య క్యాంపు నిర్వహించారు.ఈ సందర్భంగా పలువురికి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు.ఈ మేరకు మున్సిపల్ చైర్మన్ కొణతం వెంకట్ రెడ్డి,వైస్ చైర్మన్ నూకల సందీప్ రెడ్డి,కమిషనర్ నాగరాజు లకు వినతిపత్రం అందించినట్లు స్థానికులు తెలిపారు.గతంలో ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో ఉన్న పీహెచ్‌సీ భవనం శిథిలావస్థకావడంతో 2001లో జాన్ పహాడ్ రోడ్డులో నూతన భవనం ఏర్పాటు చేశారు.ప్రస్తుతం ప్రాథమిక పాఠశాలలోని ఓ గదిలో సబ్ సెంటర్ తాత్కాలికంగా కొనసాగుతోంది.పాఠశాలకు కంప్యూటర్లు రావడంతో గదిని ఖాళీ చేయాలని కోరుతున్నారని, దీంతో వైద్య సిబ్బంది క్యాంపులు నిర్వహించేందుకు ఇబ్బందులు ఎదురవుతున్నాయని,పాత పీహెచ్‌సీ స్థలంలో సబ్ సెంటర్ ఏర్పాటు చేస్తే ప్రజలకు వైద్య సేవలు సులభంగా అందుతాయని స్థానిక ప్రజలు కోరారు.అధికారులు త్వరగా చర్యలు తీసుకోవాలని కౌన్సిలర్ శ్రీకాంత్ విద్యానగర్ ప్రాంత పెద్దలు కొణతం అప్పిరెడ్డి, కొణతం ప్రతాపరెడ్డి, రంగారెడ్డి,తాళ్ల నర్సిరెడ్డి, పులజాల పుష్పలత,గజ్జల కోటేశ్వరరావు లు కోరారు.ఈ కార్యక్రమంలో పీహెచ్సీ వైద్య సిబ్బంది,ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి



**చౌటుప్పల్ ఆగస్టు 27 (జనంసాక్షి)**
ప్రస్తుత సమాజంలో మత్తు పదార్థాల వినియోగం విపరీతంగా పెరుగుతోందని, పిల్లలు వాటికి ఆకర్షితులు కాకుండా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందని జిల్లా బాలల పరిరక్షణ విభాగం సోషల్ వర్కర్ ఎం. మత్స్యగిరి హెచ్చరించారు. గురువారం మండల పరిధిలోని తంగడపల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాలలో జస్ట్ రైట్స్ చిల్డ్రన్ ఢ స్కోప్ సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో 'గుడ్ టచ్ – బ్యాడ్ టచ్', పోక్సో చట్టంపై విద్యార్థులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పిల్లలపై రోజురోజుకూ పెరుగుతున్న అత్యాచారాలను నిరోధించేందుకు చట్టాలు చాలా కఠినంగా ఉన్నాయని, లైంగిక వేధింపులకు పాల్పడితే పోక్సో చట్టం కింద కేసులు నమోదు చేసి తీవ్రమైన శిక్షలు విధిస్తారని స్పష్టం చేశారు. పిల్లలకు ఎలాంటి అత్యవసర పరిస్థితులు ఎదురైనా లేదా సమస్యలు ఉన్నా వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్ నంబర్లు 1098, 112 లకు సమాచారం అందించాలని తెలిపారు. ఫిర్యాదు చేసిన వారి వివరాలను పూర్తిగా గోప్యంగా ఉంచుతామని హామీ ఇచ్చారు. అనంతరం విద్యార్థులతో బాల్య వివాహాల నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించి అత్యవసర సేవలకు సంబంధించిన టోల్ ఫ్రీ నంబర్ల పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు డి. భార్గవి, స్కోప్ ప్రతినిధి బి. నరసింహ రాజు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఘనంగా వృక్షాబంధన్ మహోత్సవం



**నేరేడుచర్ల ఆగస్టు 27 (జనంసాక్షి):**
పట్టణంలోని పీఎం శ్రీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రాఖీ పర్వదినాన్ని పురస్కరించుకుని గురువారం వృక్షాబంధన్ మహోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్,యంగ్ లీడర్స్,వ్యవసాయ విశ్వవిద్యాలయ విద్యార్థినుల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం చేపట్టారు.ఈ సందర్భంగా విద్యార్థినులు చెట్లకు రాఖీ కట్టి వృక్షాలను సంరక్షించాలనే సందేశాన్ని అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు బట్టు మధు మాట్లాడుతూ ప్రకృతి మానవాళికి ఆత్మబంధువని, వృక్షాలు మనకు ప్రాణవాయువును అందించే బంధువులని, భూమాతకు రక్షణగా ప్రతి ఒక్కరూ నిలవాలని కోరారు.రాఖీ పర్వదిన వేడుకలు విద్యార్థుల్లో సోదరభావాన్ని పెంపొందించేందుకు దోహదపడతాయని అన్నారు.ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, సిబ్బంది,విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.

# తమ్మడపల్లిలో భూ పునఃసర్వేపై అవగాహన గ్రామసభ

### ౦90 ఏళ్ల నాటి సర్వే స్థానంలో ఆధునిక సాంకేతికతతో రీ-సర్వే

### ౦తమ్మడపల్లిలో 1,170 ఎకరాల భూముల కొలతలు





**మర్రిగూడ, ఆగస్టు 27 (జనంసాక్షి)**
తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన భూ పునఃసర్వే కార్యక్రమంలో భాగంగా మర్రిగూడ మండలంలోని తమ్మడపల్లి గ్రామంలో గురువారం అవగాహన గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమానికి చండూర్ ఆర్డీవో శ్రీదేవి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా భూ పునఃసర్వే ప్రక్రియ, ఆధునిక సాంకేతిక పరిజ్ఞానం వినియోగం, భూ యజమానుల భాగస్వామ్యం తదితర అంశాలపై అధికారులు గ్రామస్థులకు అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా ఆర్డీవో శ్రీదేవి, మర్రిగూడ తహసీల్దార్ జక్కర్తి శ్రీనివాస్ మాట్లాడుతూ.. సుమారు 90 ఏళ్ల క్రితం నిర్వహించిన పాత సర్వే రికార్డులనే అనేక ప్రాంతాల్లో వినియోగిస్తున్నందున భూముల సరిహద్దులు, రికార్డులకు సంబంధించి పలు సమస్యలు తలెత్తుతున్నాయని తెలిపారు. ఈ సమస్యలకు పరిష్కారం చూపడంతో పాటు భూ రికార్డులను ఆధునీకరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం భూ పునఃసర్వే చేపట్టిందన్నారు.నల్లగొండ జిల్లాలోని 70 గ్రామాల్లో, చండూర్ డివిజన్ పరిధిలోని 10 గ్రామాల్లో, మర్రిగూడ మండలంలోని రెండు గ్రామాల్లో రీ-సర్వే ప్రక్రియ కొనసాగుతోందని అధికారులు తెలిపారు. అత్యాధునిక సాటిలైట్ రోవర్ సాంకేతికతను వినియోగించి భూములను అత్యంత కచ్చితత్వంతో కొలతలు చేపడతామని వివరించారు.ముందుగా గ్రామ సరిహద్దులను నిర్ధారించి, గ్రామకంఠం, ప్రభుత్వ ఆస్తులు, ప్రభుత్వ భూములను గుర్తించి కొలతలు నిర్వహిస్తామని, అనంతరం పట్టా భూములను సర్వే చేస్తామని అధికారులు తెలిపారు. తమ్మడపల్లి గ్రామంలో సుమారు 1,170 ఎకరాల భూమిని రీ-సర్వే ద్వారా కొలవనున్నట్లు పేర్కొన్నారు.భూ పునఃసర్వే ద్వారా భూ రికార్డుల్లో ఉన్న పొరపాట్లను గుర్తించి సరిచేసే అవకాశం ఉంటుందని, భూముల సరిహద్దులు స్పష్టంగా నిర్ధారణ కావడంతో భవిష్యత్తులో భూ వివాదాలు తగ్గే అవకాశం ఉంటుందని అధికారులు తెలిపారు. ప్రతి భూ యజమాని తమ భూమికి సంబంధించిన పత్రాలతో సర్వే సమయంలో అందుబాటులో ఉండి సర్వే బృందాలకు సహకరించాలని సూచించారు.రీ-సర్వేలో ప్రభుత్వ, అటవీ, ఇనాం, వక్ఫ్, దేవాదాయ, అసైన్డ్, ప్రాజెక్టు భూములతో పాటు చెరువులు, వాగులు, రహదారులు, పట్టా భూములను గుర్తించి కొలతలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అనంతరం ల్యాండ్ పార్సెల్ మ్యాప్‌లను రూపొందించి, ప్రతి భూమికి యూనిక్ ల్యాండ్ పార్సెల్ ఐడెంటిఫికేషన్ నంబర్ కేటాయించే ప్రక్రియ చేపడతారని వివరించారు. భూ యజమానులకు భూధార్ కార్డులు జారీ చేసే ప్రక్రియ కూడా ఉంటుందని తెలిపారు. గ్రామసభలో రెవెన్యూ అధికారులు, సిబ్బంది, గ్రామస్థులు పాల్గొని భూ పునఃసర్వేకు సంబంధించిన సందేహాలను నివృత్తి చేసుకున్నారు. భూ యజమానులు ఎలాంటి అపోహలకు గురికాకుండా సర్వే బృందాలకు సహకరించాలని అధికారులు కోరారు.కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కమ్మ చిచ్చు వెంకటేష్, ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

# నేరాల నియంత్రణలో సీసీ కెమెరాలు కీలకం : డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు





**నాంచారిపేటలో 11 సీసీ కెమెరాల ప్రారంభం**

**ఎస్సై కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో కార్యక్రమం**

**మోటకొండూరు, ఆగష్టు 27(జనంసాక్షి):**
నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో సీసీ కెమెరాలు కీలక పాత్ర పోషిస్తాయని డీఎస్పీ శ్రీనివాస్ నాయుడు అన్నారు. మోటకొండూరు మండలం నాంచారిపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన 11 సీసీటీవీ కెమెరాలను ఆయన లాంఛనంగా ప్రారంభించారు. స్థానిక ఎస్ఐ కుమారస్వామి యాదవ్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీఎస్పీ మాట్లాడుతూ.. గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం అభినందనీయమన్నారు. ప్రతి సీసీ కెమెరా వంద మంది పోలీసులతో సమానమని, వీటి ద్వారా నిఘా సులభతరం అవుతుందని తెలిపారు. దొంగతనాలు, అవాంఛనీయ ఘటనలు జరగకుండా నిరోధించవచ్చని, ఏదైనా నేరం జరిగినా నిందితులను సులభంగా పట్టుకోవచ్చని వివరించారు. ప్రజలు స్వచ్ఛందంగా ముందుకు వచ్చి తమ వీధుల్లో కెమెరాలు ఏర్పాటు చేసుకోవడం ఇతర గ్రామాలకు ఆదర్శంగా నిలుస్తుందని ఆయన కొనియాడారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎస్సై కుమార స్వామి యాదవ్, గ్రామ సర్పంచ్ బెల్లి మల్లేష్ యాదవ్, బిఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు కంది వెంకటరామిరెడ్డి , పోలీసు సిబ్బంది, వార్డు సభ్యులు,గ్రామ పెద్దలు మరియు యువకులు తదితరులు పాల్గొన్నారు.

# కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలి



**తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్**

**ఘనంగా ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు**

**సూర్యాపేట(జనంసాక్షి):** సమాజంలో చైతన్యం తీసుకొస్తున్న కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం అధ్యక్షులు వంగ శ్రీనివాస్ గౌడ్, ప్రధాన కార్యదర్శి సుంచు లింగన్న అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలో కళాకారులు వివిధ వేషాధారణలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం పబ్లిక్ క్లబ్ లో తెలంగాణ ప్రభుత్వం, భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం ఉమ్మడి నల్లగొండ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సంఘ జిల్లా అధ్యక్షులు గుండ్ల ఆంజనేయులు అధ్యక్షతన ప్రపంచ జానపద దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై వేడుకలను ప్రారంభించి మాట్లాడారు.సమాజంలో రోజురోజుకు కనుమరుగవుతున్న కళలను ప్రభుత్వం ప్రోత్సహించాలని అన్నారు.కళలనే నమ్ముకొని వృత్తిగా కొనసాగిస్తున్న కళాకారులను ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటూ ఆదుకోవాలని కోరారు.కళలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని అన్నారు. ప్రభుత్వం కళాకారులకు ఐడి కార్డ్స్,ఉచిత బస్సు పాస్ సౌకర్యం, పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు, హెల్త్ కార్డ్స్, ప్రభుత్వ కార్యక్రమాల్లో అవకాశం కల్పించి, కళలనే వృత్తిగా జీవనం కొనసాగిస్తున్న కళలను బతికించి వారికి ఉపాధి కల్పించాలని అన్నారు.అనంతరం కళాకారులందరికీ ప్రశంసాపత్రాలు, జ్ఞాపికలను అందజేశారు.జానపద కళారంగంలో సేవలు అందిస్తున్న పలువురు కళాకారులను సన్మానించారు.ఈ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర జానపద కళాకారుల సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు పెద్దిరెడ్డి గణేష్, బాల భవన్ సూపరింటెండెంట్ బండి రాధాకృష్ణ,సంఘ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారు వీరు నాయుడు, వర్కింగ్ ప్రెసిడెంట్ ఉప్పుల నాగార్జున, కోశాధికారి చింతకుంట్ల వీరన్న, మహిళా అధ్యక్షురాలు ఆకారపు జయ, మహిళా ప్రధాన కార్యదర్శి వెన్న కవిత, నల్లగొండ జిల్లా ప్రధాన కార్యదర్శి కొంగర సైదులు, నల్లగొండ జిల్లా మహిళా అధ్యక్షురాలు రాణి, కళాకారులు తదితరులు పాల్గొన్నారు.



# శిథిలావస్థలో పి.ఏ.పల్లి సబ్ మార్కెట్ యార్డు

### -అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారిన వైనం.. పట్టించుకోని అధికారులు?



**పి.ఏ.పల్లి,ఆగస్టు 27 (జనంసాక్షి):**
రైతుల సౌకర్యార్థం ఏర్పాటు చేసిన పి.ఏ.పల్లి సబ్ మార్కెట్ యార్డు ప్రస్తుతం శిథిలావస్థకు చేరుకుని నిరుపయోగంగా మారుతోంది.యార్డు ఆవరణలో పిచ్చిమొక్కలు,కంపచెట్లు పెరిగిపోవడంతో పాటు భవనాలు,ఇతర మౌలిక వసతులు దెబ్బతిన్న పరిస్థితి కనిపిస్తోంది. దీంతో మార్కెట్ యార్డు పరిసరాలు అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా మారుతున్నాయనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.రైతులకు ఉపయోగపడాల్సిన మార్కెట్ యార్డు నిర్వహణ లోపంతో నిరుపయోగంగా మారడం పట్ల స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళల్లో యార్డు పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తుల సంచారం ఉంటోందని, దీంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గతంలోనే యార్డు దుస్థితిపై వార్తలు వెలువడినప్పటికీ పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించలేదని స్థానికులు అంటున్నారు.మార్కెట్ యార్డును వెంటనే శుభ్రం చేసి, శిథిలావస్థలో ఉన్న నిర్మాణాలకు మరమ్మతులు చేపట్టి, రైతులకు ఉపయోగపడే విధంగా పునరుద్ధరించాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే యార్డు పరిసరాల్లో భద్రతా చర్యలు చేపట్టి అసాంఘిక కార్యకలాపాలకు అడ్డుకట్ట వేయాలని అధికారులను కోరుతున్నారు.

## నూతన వధూవరులకు యు డబ్ల్యూ జె ఐ జే యు నాయకుల ఆశీస్సులు



**మాడుగులపల్లి, ఆగస్టు 27 (జనం సాక్షి ):**
మండల పరిధిలోని కన్నెకల్లు గ్రామ రెవెన్యూ అధికారి సతీష్ వినీత వివాహ రిసెప్షన్ వేడుక అత్యంత వైభవంగా జరిగింది ఈ కార్యక్రమానికి టీయూడబ్ల్యూజే ఐజేయు మాడుగులపల్లి మండల అధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు ఎస్.కె రసూల్, దర్శనం రాంబాబు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు.వధూవరులకు దంపతులు నిండు నూరేళ్లు ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలతో విలసిల్లాలని ఆకాంక్షించారుఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు, శ్రీనివాస్,స్థానిక నాయకులు గ్రామస్తులు పాల్గొన్నారు

## ఖేలో ఇండియా సంవాద్




**కోదాడ, (జనంసాక్షి):** కె .ఆర్. ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల కోదాడలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని జరుపుకోబోయే మహోత్సవానికి ముందస్తుగా ఈరోజు కళాశాల విద్యార్థులతో, క్రీడాకారులతో ఖేలో ఇండియా సంవాద్ కార్యక్రమంలో వర్చువల్ గా(ఆన్లైన్... జూమ్) దేశ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సంభాషించారు. దేశంలోని ప్రతి జిల్లాకి రెండు కళాశాలలను ఎంపిక చేయగా అందులో సూర్యాపేట జిల్లాలో కె .ఆర్ .ఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రత్యేకంగా బి కేటగిరి నందు ఎంపికయింది. ఈ కార్యక్రమానికి ప్రత్యేక ప్రోగ్రామ్ అధికారిగా వేముల వెంకటేశ్వర్లు ఎంపికయ్యారు. కళాశాల విద్యార్థులతో ఆన్లైన్ ద్వారా దేశ ప్రధానమంత్రి మాట్లాడుతూ. 2047 నాటికి వికసిత భారత్ ను నిర్మించే సృష్టికర్తలుగా విద్యార్థులు పయనించాలని, ఆలోచనలో కొత్త దృక్కోణాలు, సృజనాత్మకత అవకాశాలను పెంపొందించుకోవాలని, దేశ నిర్మాణ ప్రక్రియలో భాగస్వాములు కావాలని, ఆయన అన్నారు. దేశంలోని క్రీడా వ్యవస్థను మెరుగుపరచడం 2036లో జరిగే ఒలంపిక్స్ కోసం అందరూ ప్రతిభను పెంపొందించుకోవాలని, పాలనలో యువత భాగస్వామ్యులు కావాలని, ఆయన పిలుపునిచ్చారు. వికసిత్ భారత్ కోసం యువత శక్తివంతంగా తయారై బాధ్యతలు తెలుసుకొని హక్కులను అర్థం చేసుకొని ముందుకు వెళ్లాలని, యువత మత్తు పదార్థాలను విడనాడి ఆలోచనలకు పదును పెట్టాలని ఆయన విద్యార్థులతో ఆన్లైన్ ద్వారా మాట్లాడారు. ఈ సందర్భంగా కళాశాల విద్యార్థులతో మాదకద్రవ్యాలకు వ్యతిరేకంగా ప్రతిజ్ఞ చేయించడం జరిగింది. ఎన్.ఎస్.ఎస్ ప్రోగ్రాం అధికారి, సమన్వయకర్త వేముల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఇన్చార్జ్ ప్రిన్సిపాల్ ఆర్. పిచ్చిరెడ్డి, కోదాడ నియోజకవర్గ మై భారత్ సమన్వయకర్త వెంకట భవాని లతోపాటుగా కళాశాల సిబ్బంది జి.యాదగిరి, వి.బల భీమారావు, పి.రాజేష్,జి.వెంకన్న, ఎన్.ఎస్.ఎస్ వాలంటీర్స్, విద్యార్థులు పాల్గొన్నారు.



## పాఠశాలలో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు

**ఆత్మకూర్ (ఎం) జనంసాక్షి ఆగష్టు (27)** మండలం లో ని సరస్వతి విద్యమందిర్ పాఠశాలలో గురువారం రోజున రక్షాబంధన్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఒకరినొకరు రాఖీలు కట్టుకొని పండుగ శు భాకాంక్షలు తెలుపుకున్నారు. రాఖీ పండుగ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు పంజాల నర్సయ్య గౌడ్ మాట్లాడుతూ రక్షాబంధన్ పండుగ విశిష్టతను విద్యార్థులకు వివరించారు. రాఖీ పండుగ సోదరీ సోదరుల ప్రేమానురాగాలకు ప్రతీక అని, రక్షాబంధన్ పండుగను ప్రజలంతా ఆనందోత్సవాలతో జరుపుకునే అతి ముఖ్యమైన పండుగ అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సరస్వతి పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



## తిలక్ రెడ్డి జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాలు సేవా కార్యక్రమాలు



**కొండమల్లేపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి):** దేవరకొండ నియోజకవర్గంలో ఎన్నో కుటుంబాలకు ఆర్థిక చేయూతనిస్తూ కష్ట కాలంలో ప్రజలకు తోడుగా ఉంటూ తమ సొంత నిధులతో కోట్ల రూపాయలు ఖర్చుపెట్టి పాఠశాలలకు దేవాలయాలకు ప్రజల వ్యక్తిగత అత్యవసరాలకు ఎన్నో సేవా కార్యక్రమాలు చేపట్టిన ఉన్నత విద్యావంతుడు, గ్రూప్ 1 గ్రూప్ 2 సివిల్స్, పోలీస్ ఉద్యోగ విద్యార్థులకు లక్షల రూపాయల విలువ చేసే మెటీరియల్స్ అందజేసి ఉద్యోగ అవకాశాలు వచ్చే విధంగా శిక్షణలను ఇప్పించి ప్రజలందరి హృదయాలలో చిరస్థాయిగా పేరు ప్రఖ్యాతలు పొందిన గొప్ప సేవాభావి కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు జాలె తిలక్ రెడ్డి జన్మదిన వేడుకలు దేవరకొండ నియోజకవర్గంలో వారి ఆత్మీయులు శ్రేయోభిలాషులు అభిమానులు తిలక్ రెడ్డి జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. అనంతరం జాలె తిలక్ రెడ్డి జన్మదిన సందర్భంగా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేశారు. తిలక్ రెడ్డి జన్మదిన సందర్భంగా హైదరాబాద్ బి.ఎన్.రెడ్డి ప్రాంతంలోని శాంతి నికేతన్ ఫౌండేషన్ లో ఏర్పాటు చేసిన జన్మదిన వేడుకల్లో పిఏసిఎస్ చైర్మన్, కాంగ్రెస్ పార్టీ పిసిసి కార్యవర్గ సభ్యులు జాలె నరసింహ రెడ్డి, తిలక్ రెడ్డితో కేక్ కట్ చేయించి అన్నదాన కార్యక్రమంలో వృద్ధులకు వికలాంగులకు ఒకరోజు భోజనాలను ఏర్పాటు చేసి వృద్ధులకు వికలాంగులకు తమ స్వహస్తలతో భోజనాలు వడ్డించారు. అనంతరం ప్రజల హృదయాలను గెలిచిన జాలే బ్రదర్స్ మాట్లాడుతూ అన్నదానమే ప్రాణశక్తికి మూలం అందుకే అన్నదానం చేయడం అంటే ప్రాణాన్ని దానం చేయడంతో సమానం అన్నారు. అదే విధంగా ఏ దానం చేసినా ఎదుటివారికి పూర్తి తృప్తి కలుగుతుందో లేదో కానీ ఆకలి తీర్చే అన్నదానం మాత్రం కడుపు నింపి పరిపూర్ణ సంతృప్తిని ఇస్తుందని అన్నారు. అన్నం పరబ్రహ్మ స్వరూపం అంటారు ఆహారాన్ని భగవంతుని స్వరూపంగా భావించి అతిథులను ఆకలితో ఉన్నవారిని దైవంతో సమానంగా చూసి వారికి సేవ చేయాలని అన్నారు. అన్నదానం చేసే టప్పుడు మనసులో ప్రేమ చేతల్లో ఆత్మీయత కలిగి ఉండాలని అన్నారు. ఎలాంటి ఆశ లేకుండా చేసే సహాయం మనిషిని మానవ త్వానికి ప్రతీ రూపంగా నిలబెడుతుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, జాలే బ్రదర్స్ అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

## పాలిటెక్నిక్ విద్యార్థుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలి

### బిజెపి జిల్లా అధ్యక్షురాలు చల్లా శ్రీలత రెడ్డి



**నేరేడుచర్ల ఆగస్టు 27 (జనంసాక్షి) :** ప్రజల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను పోలీసు బలగాలతో అణిచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యానికి నిదర్శనం అని చల్లా శ్రీలత రెడ్డి అన్నారు. గురువారం నాడు పత్రికా ప్రకటనలో తెలుపుతూ జీవో నెం.97 కు వ్యతిరేకంగా ఆందోళన చేస్తున్న పాలిటెక్నిక్ విద్యార్థులను కలిసేందుకు వెళ్లాల్సి ఉన్న బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్ రామచంద్రరావు ని గృహనిర్బంధం చేయడం, బిజెపి నాయకులను పోలీసు బలగాలతో ముందస్తు అరెస్టులు చేయడం సరికాదని, ప్రశ్నించే గొంతులను అణచివేసి నిరంకుశ పాలనకు పాల్పడుతోందని విమర్శించారు. పెండింగ్లో ఉన్న ఫీజ్ రియంబర్స్మెంట్ బకాయిలను విడుదల చేయాలని, విద్యార్థుల ప్రజాస్వామ్య హక్కులను గౌరవించాలని డిమాండ్ చేశారు.

### సర్ నోటీసులు అందుకున్నవారు గడువులోపు

## డాక్యుమెంట్లు సమర్పించాలి

### - తహసీల్దార్ బండా కవిత



**హుజూర్నగర్, ఆగస్టు 27 (జనంసాక్షి) :** సర్ నోటీసులు అందుకున్న వారు గడువులోపు అధికారులకు, బి ఎల్ ఓ లకు డాక్యుమెంట్లు సబ్మిట్ చేయాలని హుజూర్నగర్ తహసీల్దార్ బండా కవిత అన్నారు. పట్టణంలోని 19వ వార్డులో బూత్ నెంబర్లు 224, 225 వివిఎం స్కూల్లో నిర్వహించిన ఎస్ ఐ ఆర్ గ్రామసభ అవగాహన కార్యక్రమంలో హుజూర్ నగర్ తాసిల్దార్ బండ కవిత, అట్లూరి హరిబాబు మంజుల, ఎండి. అజీజ్ పాషా, బిఎల్ఓ, బి ఎల్ ఎ లతో కలిసి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ కవిత మాట్లాడుతూ ఎస్ ఐ ఆర్ ప్రక్రియకు సంబంధించిన వివరాలను ప్రజలకు వివరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును సక్రమంగా వినియోగించుకునేలా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ప్రజలకు ఎలాంటి సందేహాలు ఉన్నా సంబంధిత అధికారులను సంప్రదించి ప్రక్రియను పూర్తిగా అర్థం చేసుకోవాలని తెలిపారు. ప్రజాస్వామ్యానికి ఓటే పునాది, ప్రతి అర్హుడి ఓటు హక్కు పరిరక్షణే మన బాధ్యత. సర్ ప్రక్రియపై ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించి పలు ఫిర్యాదులపై సలహాలు, సూచనలు చేశారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేద్దాం" అని అన్నారు. ఈ కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ సందీప్, బి ఎల్ ఓ లు పునుగుపాటి సరళ, అన్వర్ బేగం, హేమలత, తిరుపమ్మ, ప్రత్యూష, అంకమ్మ తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ రహదారుల పక్కన మద్యం అమ్మకాలు నిషేధించాలి

### ○హోటల్స్ దాబాల పక్కన బారీ వాహనాలను నిలిపితే కఠినచర్యలు ○ఎస్ఐ చలికంటి నరేష్



**హుజూర్నగర్, ఆగస్టు 27 (జనంసాక్షి):** జాతీయ రహదారుల పక్కన మద్యం అమ్మకాలు నిషేధించాలని, హోటల్స్ దాబాల పక్కన బారీ వాహనాలను నిలిపితే కఠినచర్యలు తీసుకుంటామని ఎస్ఐ చలికంటి నరేష్ హెచ్చరించారు. బుధవారం హుజూర్నగర్ పట్టణంలోని నేషనల్ హైవే వెంట ఉన్న బెల్ట్ షాపులు, హోటళ్ళు, కిరాణా దుకాణాల యజమానులను పోలీస్స్టేషన్కు పిలిపించి కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నరేష్ మాట్లాడుతూ నేషనల్ హైవే వెంట ఉన్న ప్రతి దుకాణంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. దుకాణాల వద్ద జరిగే ప్రతి కార్యకలాపం నిఘాలో ఉండేలా కెమెరాలను ఏర్పాటు చేయడం ద్వారా భద్రతను మరింత పెంచవచ్చని తెలిపారు. దుకాణ యజ మానులు పోలీసులకు సహకరించి, ఎలాంటి అనుమానాస్పద కార్యకలాపాలకు అవకాశం ఇవ్వకూడదని సూచించారు. అదేవిధంగా నేషనల్ హైవేపై వాహనాలను ఇష్ట రాజ్యంగా నిలిపి ట్రాఫిక్కు అంతరాయం కలిగించవద్దని ఎస్ఐ హెచ్చరించారు. ముఖ్యంగా హోటళ్లు, కిరాణా దుకాణాలు, ఇతర వ్యాపార సంస్థల ముందు వాహనా లను రోడ్డుపై నిలిపివేయడం వల్ల ప్రమాదా లకు అవకాశం ఉంటుందని తెలిపారు. హైవేపై ట్రాఫిక్ సజావుగా సాగేందుకు ప్రతి ఒక్కరూ నిబంధనలు పాటించాలని కోరారు. నేషనల్ హైవేపై ప్రజల భద్రతకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలి. దుకాణాల వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలి. హైవే పై వాహనాలను నిలిపి ట్రాఫిక్కు ఆటంకం కలిగిస్తే చర్యలు తప్పవు" అని అన్నారు. నేషనల్ హైవే పరిధిలో అనుమతులు లేకుండా మద్యం విక్రయించే బెల్ట్ షాపుల నిర్వహణతో పాటు మద్యం సేవించి వాహనాలు నడపడం వల్ల ప్రమాదాల ముప్పు పెరిగే అవకాశం ఉందన్నారు. పోలీసులు నిర్వహించిన కౌన్సెలింగ్తో పాటు నిబంధనలను ఉల్లంఘించే వారిపై నిరంతర నిఘా కొనసాగించాలని ప్రజలు కోరుతున్నారు. నేషనల్ హైవే భద్రత, ట్రాఫిక్ క్రమబద్ధీకరణకు పోలీసులతో పాటు వ్యాపారులు, వాహనదారులు, ప్రజలు సహకరించాలని ఎస్ ఐ కోరారు.

# అర్హులైన జర్నలిస్టులందరికీ ఇళ్ల స్థలాలు కేటాయింపు పై ప్రభుత్వం దృష్టి సారించాలి

○బిఆర్ఎస్ ,ప్రజాసంఘాల నాయకులు
○జర్నలిస్టులకు ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేయిస్తాం. .
○కాంగ్రెస్ మండల అధ్యక్షుడు అర్జున్ రావు

**కల్లూరు ఆగస్టు 27(జనంసాక్షి)**
ప్రజా సమస్యల పరిష్కారం, ప్రభుత్వ పథకాల అమలుకోసం ప్రజలకు ప్రభుత్వానికి మధ్య వారధిగా ఉంటూ నిరంతరం శ్రమించే జర్నలిస్టులు నేడు వారి సమస్యల పరిష్కారం కోసం రోడ్డెక్కి పాదయాత్ర చేయటం బాధాకరమని, వెంటనే ప్రభుత్వం జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు మంజూరు చేసి సమస్యల పరిష్కారం పై దృష్టి సారించాలని పలు రాజకీయ పార్టీలు ప్రజా సంఘాల నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. బిఆర్ఎస్ పార్టీ నాయకులు కట్టా అజయ్ కుమార్ , లక్కినేని రఘు, మేకల కృష్ణ, పెడకంటి రామకృష్ణ, కనపర్తి రాజశేఖర్, జనసేన పార్టీ నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోట్రు అర్జున్ రావు టౌన్ కమిటీ అధ్యక్షులు షేక్ ఉస్మాన్, మున్సిపాలిటీ కౌన్సిలర్ ఉబ్బన రాంబాబు, సిఐటియు గంప శ్రీనివాసరావు, కె. వెంకటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్టులు గంగుల గోపి, గరిడేపల్లి వెంకటేశ్వర్లు, పాటిబండ్ల సాంబశివరావు దాసరి డేవిడ్, బొల్లం రామారావు, పలువురు మండల జర్నలిస్టులు, జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం టీయూడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో చేపట్టిన పాదయాత్ర జర్నలిస్టుల బృందానికి సంఘీభావం వ్యక్తం చేస్తూ ఘన స్వాగతం పలికారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం చేపట్టిన పాదయాత్ర గురువారం కల్లూరు మండల కేంద్రానికి చేరుకున్న సందర్భంగా పట్టణ మెయిన్ సెంటర్ లో గల అంబేద్కర్ విగ్రహానికి టిడబ్ల్యూజేఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, శ్రీనివాస్ రెడ్డిలు పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా బి ఆర్ ఎస్, కాంగ్రెస్, ప్రజాసంఘాల నాయకులు పలువురు జర్నలిస్టులు ప్రసంగించారు.
సమాజంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమైనదని కొనియాడారు. అధికారంలో ఉన్నా, ప్రతిపక్షంలో ఉన్నా రాజకీయ నాయకులు చేసే ప్రతి కార్యక్రమాన్ని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలు, ప్రజా సమస్యలను ప్రజల ముందుకు తీసుకెళ్లేందుకు జర్నలిస్టులు రాత్రింబవళ్లు శ్రమిస్తున్నారని గుర్తుచేశారు. అన్ని ప్రభుత్వాలు జర్నలిస్టులను సమస్యలను పరిష్కరించడంలో విఫలమయ్యాయి అన్నారు..సొంత ఇల్లు లేక ఎంతోమంది జర్నలిస్టులు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని,ప్రభుత్వం తక్షణమే స్పందించి అర్హులైన జర్నలిస్టులందరికీ ఇండ్లు, ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని నాయకులు డిమాండ్ చేశారు. జర్నలిస్టుల న్యాయమైన పోరాటానికి తాము ఎల్లప్పుడూ అండగా ఉంటామని స్పష్టం చేశారు. మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పొట్రూ అర్జున్ రావు. పట్టణం అధ్యక్షులు ఉస్మాన్ మాట్లాడుతు ప్రభుత్వం జర్నలిస్టులకు ఇచ్చిన హామీని అమలుపరిచేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రెవెన్యూ సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, స్థానిక శాసన సభ్యురాలు డాక్టర్ మట్టా రాగమయి దయానంద్ దృష్టికి తీసుకువెళ్లి సమస్య పరిష్కారం కోసం తమవంతు కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా జర్నలిస్టుల బృందం సభ్యులను కౌన్సిలర్లు, వివిధ రాజకీయ పార్టీల నాయకులు, శాలువాలతో ఘనంగా సత్కరించారు. అనంతరం జర్నలిస్టులు కల్లూరు పట్టణ మెయిన్ సెంటర్




నుంచి తాసిల్దార్ కార్యాలయం వరకు పాదయాత్ర కొనసాగించి జర్నలిస్టుల సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్యాలయ అధికారికి వినతి పత్రం సమర్పించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బి.రాజశేఖర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టిబిజేపి జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ నలబోల మధుశ్రీ,, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.ఎస్ చక్రవర్తి, సీనియర్ జర్నలిస్ట్ మారెడ్డి నాగేందర్ రెడ్డి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, పీజీబీపి కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్య గణేష్, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అర్షద్, నాయకులు గంగుల



గోపి, మందా శరత్, చిర్రా పవన్, పెరుమాళ్ళపల్లి నాగార్జున, కల్లూరు మండల జర్నలిస్టులు జిల్లెల్ల మహేష్, డి ఎస్ వర్మారావ్, అనిల్, పుల్లయ్య, శంకర్, నరేష్, శ్రీనివాసరావు, రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

## పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత

**గుడిపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి):**



వనమహోత్సవం కార్యక్రమంలో భాగంగా గుడిపల్లి మండల కేంద్రంలో గురువారం మొక్కలు నాటే కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ కున్ రెడ్డి రాజశేఖర్ రెడ్డి ముందుగా మొక్కను నాటి కార్యక్రమాన్ని ప్రారంభించారు.
ఈ సందర్భంగా సర్పంచ్ రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అన్నారు. భవిష్యత్ తరాలకు స్వచ్ఛమైన, ఆరోగ్యకరమైన వాతావరణాన్ని అందించేందుకు పెద్ద ఎత్తున మొక్కలు నాటి సంరక్షించాలని సూచించారు. 'మొక్కలు నాటి భవిష్యత్తును కాపాడుదాం' అనే నినాదంతో ప్రభుత్వం పచ్చదనం పెంపొందించడంపై విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తోందన్నారు.మారుతున్న వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో కాలుష్యాన్ని కట్టడి చేయడంతోపాటు గుడిపల్లి గ్రామాన్ని హరితమయంగా తీర్చిదిద్దాల్సిన అవసరం ఉందన్నారు. పచ్చదనం పెంపొందించడంతో గ్రామంలో ఆహ్లాదకరమైన వాతావరణం ఏర్పడుతుందని తెలిపారు. మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. గ్రామంలో పచ్చదనం పెంపొందించేందుకు అటవీశాఖ, గ్రామపంచాయతీతో పాటు ప్రజలు సహకరించాలని సర్పంచ్ విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అరవపల్లి శ్రీనయ్య, వార్డు సభ్యులు, ఫీల్డ్ అసిస్టెంట్ భూతం అనిత, వి.బి.జి.ఆర్.ఎం.జి. కూలీలు, గ్రామ ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా పీవీ జన్మదిన వేడుకలు

**బీబీనగర్ (జనంసాక్షి):**



పిఆర్ ఫౌండేషన్ అధినేత, బీజేపీ రాష్ట్ర నాయకులు పి.వి శ్యామ్ సుందర్ రావు జన్మదిన వేడుకలను గురువారం ఆయన అభిమానులు బిజెపి నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా బిజెపి నాయకులు పొట్ట నవీన్ కుమార్ ఆధ్వర్యంలో బీబీనగర్ మండలం కొండమడుగు మెట్టు వద్ద గల శ్రీ మంగళ మైసమ్మ గుడి ఆవరణంలో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కడెం పాండురంగం, నాయకులు భువనగిరి స్వామి గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, వెంపటి సుదర్శన్, చెవ్వగొని గణేష్, బరిగల రవికుమార్, పొట్ట మహేష్, పొట్ట భాస్కర్ ,పంజాల ప్రవీణ్ గౌడ్, సురకంటి హరిప్రసాద్ రెడ్డి, పొట్ట లింగం, పొట్ట మధు,పొట్ట సాయి తేజ,కౌశిక్ పటేల్, చిన్ను, శివ తదితరులు పాల్గొన్నారు.

## జర్నలిస్టుల పాదయాత్రతో ప్రభుత్వం కళ్లు తెరవాలి

○హామీలు ఇచ్చి అమలు చేయకుండా జర్నలిస్టులను వాడుకోవడం దుర్మార్గం
○రాజకీయ ప్రజా సంఘాల నాయకులు

**పెనుబల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి )**
జర్నలిస్టుల పాదయాత్రతో ప్రభుత్వం కళ్ళు తెరిచి జర్నలిస్టులకి ఇచ్చిన హామీమేరకు ఇళ్ల స్థలాలను వెంటనే ఇవ్వాలని టిఆర్ఎస్, సిపిఎం, బిజెపి, తెలుగుదేశం, సిపిఐ ఎంఎల్ మాస్ లైన్, ఎమ్మార్పీఎస్, పౌర హక్కుల సంఘం నాయకులు డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో జర్నలిస్టుల ఇళ్ల స్థలాల కోసం టిడబ్ల్యూజేఎఫ్ ఆధ్వర్యంలో పాలేరు నియోజకవర్గంలో జూలై 22న ప్రారంభమైన జర్నలిస్టుల పాదయాత్ర, 25న వైరా ముగించుకొని, 27న సత్తుపల్లి నియోజకవర్గంలోని తల్లాడ, కల్లూరు మండలాలతో పాటు గురువారం పెనుబల్లి మండలానికి చేరుకుంది. మండల కేంద్రంలో గల గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించాలి. అనంతరం ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నల్లమల ప్రతాప్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కాంగ్రెస్, బిజెపి, బిఆర్ఎస్, సిపిఎం, టిడిపి, బిఎస్పి, ఎమ్మార్పీఎస్, పౌర హక్కుల సంఘం తదితర నాయకులు, మాట్లాడుతూ జర్నలిస్టుల పాదయాత్రతో ప్రభుత్వం కళ్లు తెరవాలని, జర్నలిస్టులకు ఇచ్చిన ఇళ్ల స్థలాల హామిని అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలను పరిష్కరించే జర్నలిస్టులు తమ సమస్యలు పరిష్కరించాలని రోడ్డు ఎక్కి పాదయాత్ర చేయటం దారుణం అన్నారు. జర్నలిస్టులను ఇబ్బందులకు గురిచేసి మనుగడ సాధించిన ప్రభుత్వాలు ఏమీ లేవని, తక్షణమే జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు. పెనుబల్లి మండల ప్రెస్ క్లబ్ అధ్యక్షులు నల్లమల ప్రతాప్ మాట్లాడుతూ... జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్యని ఒక బాధ్యతగా చేపట్టిన టిడబ్ల్యూజేఎఫ్ నాయకత్వానికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. జర్నలిస్టుల ఇళ్ల స్థలాల సమస్య ప్రతి ఒక్కరిదని యూనియన్ల కతీతంగా జర్నలిస్టులందరూ సమస్య సాధనకు ఐకమత్యంగా కదిలి రావాలని పిలుపునిచ్చారు.




టిడబ్ల్యూజెఎఫ్ జిల్లా నాయకులకు భద్రాద్రి కొత్తగూడెం నుండి వచ్చిన సీనియర్ జర్నలిస్టులు తోకల శ్రీనివాస్, పూనేం ప్రదీప్, రవి, నాగేంద్ర, రాజు, అన్వేష్ రెడ్డి, అనిల్ లు తమ సంపూర్ణ సంఘీభావాన్ని తెలియజేశారు.
ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. జర్నలిస్టులకు ఇళ్ల స్థలాలు ఇచ్చిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదేనని ఇళ్ల స్థలాలు ఇచ్చేందుకు మా ఎం ఎల్ ఏ,మంత్రుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కార్యక్రమంలో... సిపిఎం జిల్లా నాయకులు చలమాల విఠల్రావు, పౌర హక్కుల సంఘం జిల్లా నాయకులు కాటినేని శ్రీనివాసరావు. గాయం తిరుపతిరావు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు పంది వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ సర్పంచుల సంఘం మండల అధ్యక్షులు మాలోత్ రాధాకృష్ణ, కాంగ్రెస్ నాయకులు చీకటి రామారావు,మాజీ జెడ్పిటిసి చెక్కిలాల మోహన్ రావు, బిఆర్ఎస్ నాయకులు మందడపు అశోక్ కుమార్, టిడిపి మండల అధ్యక్షులు తుమ్మలపల్లి రాజేశ్వరరావు, బిజెపి నాయకులు బొర్ర నరసింహారావు, బీఎస్పీ నియోజకవర్గ అధ్యక్షులు రావూరి రమేష్, ఈ జర్నలిస్టుల పాదయాత్రలో తమ సంఘీభావం తెలియజేశారు, ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు బి .రాజశేఖర్, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు సయ్యద్ ఖదీర్, కొత్తపల్లి శ్రీనివాస్ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు దువ్వా సాగర్, టిబిజేపి జిల్లా కార్యదర్శి మానుకొండ రవికిరణ్, స్టేట్ కౌన్సిల్ మెంబర్ మారెడ్డి నాగేంద్ర రెడ్డి, నలబోల మధుశ్రీ, బాలకృష్ణ, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు టి.ఎస్ చక్రవర్తి, జిల్లా కమిటీ సభ్యులు గరిడేపల్లి వెంకటేశ్వర్లు, కొరకొప్పుల రాంబాబు, పీజీబీపి కెమెరామెన్స్ జిల్లా కార్యదర్శి భూక్య గణేష్, అక్రిడిటేషన్ కమిటీ మెంబర్ అర్షద్, యూషప్, నాయకులు గంగుల గోపి, మందా శరత్, చిర్రా పవన్, పెరుమాళ్ళపల్లి నాగార్జున తదితరులు పాల్గొన్నారు.

# నేపాల్ వలస కూలీకి ఖమ్మంలో అంత్యక్రియలు

ఖమ్మం, (జనంసాక్షి) : నేపాల్ దేశానికి చెందిన వలస కూలీ ఖమ్మం జిల్లాలో మృతి చెందగా, కుటుంబ సభ్యుల ఆర్థిక పరిస్థితిని దృష్టిలో ఉంచుకుని అన్నం ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఖమ్మం లోనే అంత్యక్రియలు నిర్వహించారు. బోనకల్ మండలం మోటమర్రి రైల్వే స్టేషన్ పరిధిలో భారత్ ధమాయి అనే 45 ఏళ్ల వ్యక్తి నేపాల్ నుంచి చెన్నైకు రైలులో ప్రయాణిస్తుండగా మూడు రోజుల క్రితం మృతి చెందాడు. దీంతో రైల్వే పోలీసులు మృతదేహాన్ని ఖమ్మం ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీకి తరలించారు. మృతుడి వద్ద లభించిన నేపాల్ దేశ పౌరసత్వ ఆధారాల ద్వారా కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. దీంతో వారు ఖమ్మం రైల్వే పోలీసులను సంప్రదించి మృతదేహాన్ని గుర్తించారు. అయితే మృతదేహాన్ని నేపాల్‌కు తీసుకెళ్లేందుకు అవసరమైన ఆర్థిక స్థోమత లేకపోవడంతో ఖమ్మంలోనే అంత్య క్రియలు నిర్వహించాలని కుటుంబ సభ్యులు పోలీ సులను కోరారు. రైల్వే పోలీసుల సూచనతో కుటుంబ సభ్యులు అన్నం ఫౌండేషన్‌ను సంప్రదించగా, ఫౌండేషన్ మృతదేహానికి అంత్యక్రియలు నిర్వహించేందుకు ముందుకు వచ్చింది. రైల్వే హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణరెడ్డి, మార్చురీ సిబ్బంది, కుటుంబ సభ్యుల సమక్షంలో



మృతదేహాన్ని అన్నం ఫౌండేషన్ స్వాధీనం చేసుకుంది. నేపాల్ దేశ ఆచార సంప్రదాయాల ప్రకారం మృతదేహాన్ని తెల్లని వస్త్రంతో చుట్టి, పూలు, పూలమాలలతో గౌరవించి బల్లేపల్లి వైకుంఠధామానికి తరలించారు. అక్కడ కుటుంబ సభ్యుల సమక్షంలో దహన సంస్కారాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అన్నం ఫౌండేషన్ చైర్మన్ అన్నం శ్రీనివాసరావుతో పాటు ఫౌండేషన్ సిబ్బంది పాల్గొన్నారు.



## చైతన్యతేజ జ్ఞాపకార్థం..

## అంజనాపురం పాఠశాలలో అన్నదానం..

బూర్గంపహాడ్ ఆగస్టు 27 (జనంసాక్షి)

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండల పరిధిలోని అంజనాపురం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో తేజావత్ సీతారాములు, విజయ దంపతులు తమ కుమారుడు తేజావత్ చైతన్యతేజ జ్ఞాపకార్థం గురువారం అన్నదానం నిర్వహించారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులకు భోజనం ఏర్పాటు చేశారు. గోదావరిఖనిలో సింగరేణి అసిస్టెంట్ మేనేజర్‌గా పనిచేస్తున్న సమయంలో జరిగిన ప్రమాదంలో మూడేళ్ల క్రితం చైతన్యతేజ మృతిచెందారు. ఆయన జయంతిని పురస్కరించుకుని తల్లిదండ్రులు ప్రతి ఏటా పాఠశాలలో అన్నదానం, కేక్ కటింగ్ కార్యక్రమాలు నిర్వహిస్తూ ఆయన జ్ఞాపకాలను స్మరించుకుంటున్నారు. చైతన్యతేజ జ్ఞాపకార్థం ఇప్పటికే ఆయన మిత్రబృందం సహకారంతో పాఠశాలలో రూ.2.50 లక్షల వ్యయంతో కళావేదికను నిర్మించి అందించినట్లు తల్లిదండ్రులు తెలిపారు. విద్యార్థుల కోసం చేపడుతున్న సేవా కార్యక్రమాలను కొనసాగిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కిషన్‌రావు, ఉపాధ్యాయులు, విద్యార్థులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.



సూర్యానాయక్ తండాలో అవగాహన కల్పిస్తున్న తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు

జాజిరెడ్డిగూడెం మండల ఆగస్టు 27 (జనంసాక్షి)

ఎల్లినో ప్రభావంతో ఏర్పడిన వర్షా బావ పరిస్థితుల దృష్ట్యా రైతులు పంట సాగులో అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని తెలంగాణ సాంస్కృతిక సారథి జిల్లా టీం లీడర్ వెన్నెల నాగరాజు అన్నారు. గురువారం సూర్యానాయక్ తండాలో తెలంగాణ సాంస్కృతిక సారథి ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావంతో ఏర్పడిన పరిస్థితుల దృష్ట్యా ఆరుతడి పంటల సాగు, పరిసరాల పరిశుభ్రత, గంజాయి, గంజాయి తదితర అంశాలపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మేడిపల్లి వేణు, శంకర్, లక్ష్మి, రాధ, శిరీష, గిరిజనులు పాల్గొన్నారు.

# గురుకులాల్లో స్పాట్ అడ్మిషన్లు

## 29న స్పాట్ కౌన్సెలింగ్.. అర్హులైన విద్యార్థులు హాజరు కావాలి

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి)



జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశాల మేరకు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలు, కళాశాలల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ఈ నెల 29న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు అన్నపురెడ్డిపల్లి మండల కేంద్రంలోని గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ టీ. బాలరాజు తెలిపారు. 5వ తరగతి నుంచి 9వ తరగతి వరకు, ఇంటర్ మొదటి సంవత్సరం ఖాళీ సీట్లకు అర్హులైన విద్యార్థులు కౌన్సెలింగ్‌కు హాజరు కావచ్చని పేర్కొన్నారు. బాలికలు పాల్వంచలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాలలో, బాలురు పాల్వంచలోని తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల, కళాశాల సీఓఈలో కౌన్సెలింగ్‌కు హాజరు కావాలని సూచించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో కలిసి హాజరై ఒరిజినల్ కుల, ఆదాయ ధ్రువపత్రాలు, ఆధార్ కార్డు, స్టడీ సర్టిఫికెట్‌తో పాటు నాలుగు పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీసుకురావాలని తెలిపారు. అర్హులైన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ బాలరాజు కోరారు.

# వేదాలెక్స్ ఆయుర్వేద ఉత్పత్తులతోనే మంచి ఆరోగ్యం

## కొండమల్లేపల్లి సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి

కొండమల్లేపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి):

కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని బస్టాండ్ ఎదురుగా పాత ఆదర్శ స్కూల్ పక్కన ఆయుర్వేదిక్ వేదాలెక్స్ స్టోర్ ను సర్పంచ్ పసునూరి యుగేందర్ రెడ్డి నూతనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్యమే మహాభాగ్యం ఎలాంటి సైడ్ ఎఫెక్ట్స్ లేని వంద శాతం నమ్మకమైన ఆయుర్వేద మందులు సప్లిమెంట్స్ పూర్తి ఆర్గానిక్ నిత్యావసర వస్తువులు మన ప్రాంతంలో ప్రకృతి సిద్దమైన ఆయుర్వేద ఉత్పత్తులతో వేదాలెక్స్ స్టోర్ ప్రారంభించడం సంతోషకరం అని అన్నారు. ఆరోగ్యకరమైన జీవనం కోసం విశ్వసనీయమైన ఆయుర్వేదిక్ ఉత్పత్తులను ప్రజలందరూ వినియోగించుకోవాలన్నారు. హోమ్ కేర్ హెల్త్ కేర్ పర్సనల్ కేర్ వెటర్నరీలకు సంబంధించిన అన్ని రకాల ఆయుర్వేద మందులు లభిస్తాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అనంతరం వేదాలెక్స్ ప్రొప్రైటర్ వస్తువుల యాదయ్య మాట్లాడుతూ 100 శాతం సేఫ్ఆర్గానిక్ ఉత్పత్తులు కెమికల్స్, ప్రిజర్వేటివ్స్ లేని వస్తువులు షుగర్, బీపీ, ఇతర ఆరోగ్య సమస్యలకు ఆయుర్వేద పరిష్కారాలు డైలీ నీడ్స్, బ్యూటీ కేర్, అగ్రికల్చర్ ఉత్పత్తులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఈ అద్భుతమైన ఆయుర్వేద ఉత్పత్తులతో ప్రతి ఇంటికి ఆరోగ్యం, ఆనందం అందించాలన్నదే మా లక్ష్యం అని అన్నారు. అనంతరం ముఖ్యఅతిథులకు శాలువాలతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ కొడిదాల పద్మ వెంకటయ్య, వార్డు సభ్యులు వస్కుల శ్రీనివాస్, బిజిలి లింగం, పర్వతం కొండల్, గంట మల్లేష్, స్పార్కియాన్ స్టార్ రఫీ, మెగాస్టార్ మహేష్, నేలంటి కిరణ్, వస్కుల వెంకటేష్, ఆంజనేయులు, రాజేష్, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



# ప్రభుత్వాసుపత్రిని సూపర్ స్పెషాలిటీ వైద్యశాలగా ఆదునీకరించాలి




- జిల్లా కేంద్రం లో ఈఎస్ఐ హాస్పటల్ ఏర్పాటు చేయాలి
- ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు కల్పించాలి
- రైతు బీమా పథకాన్ని కొనసాగించాలి..
- సమస్యల పరిష్కారం కోసం 31న కలక్టరేట్ వద్ద ధర్నా..
- విలేకర్ల సమావేశంలో సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు..

ఖమ్మం, (జనంసాక్షి) : జిల్లా ప్రభుత్వ వైద్యశాలను సూపర్ స్పెషాలిటీ హాస్పటల్ గా వెయ్యి పడకలు కేటాయించి అప్ గ్రేడ్ చెయ్యాలని సిపిఐ ఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వర రావు డిమాండ్ చేశారు.పార్టీ జిల్లా కార్యాలయం సుందరయ్య భవనంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు కీలకమైన విద్యా,వైద్య రంగాలపై తమ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో సర్వే నిర్వహించామని, ఈ సర్వే లో ప్రభుత్వ వైద్య రంగం పడకే సినట్లు తమ దృష్టి కి వచ్చిందన్నారు.జిల్లా ప్రభుత్వ హాస్పటల్ తో పాటు 55 వైద్య సెంటర్లు ఉన్న జిల్లాలో ప్రస్తుత వర్షాకాల సీజన్ లో మౌలిక వసతులు లేక ప్రజలు సీజనల్ వ్యాధుల బారిన పడి తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు అని పేర్కొన్నారు.జిల్లా కేంద్ర ప్రభుత్వ ఆసుపత్రి లో కోట్లాది రూపాయలు వెచ్చించి ఏర్పాటు చేసిన ఎం ఆర్ ఐ నీ ఆపరేట్ చేసేందుకు కనీసం ఆపరేటర్ లేరని దీనివల్ల ప్రజలు బయట చేయించుకొని ఆర్థికంగా తీవ్రంగా నష్టపోతున్నారని అన్నారు. జిల్లాలో కనీస సౌకర్యాలు లేకపోవడంవల్ల 70శాతం మంది ప్రజలు ప్రవేట్ వైద్య శాలలనే ఆశ్రయిస్తున్నారని తెలిపారు.ప్రభుత్వ హాస్పటల్ లోప్రజల రోగాలకి 6వేలు ఖర్చు అయితే ప్రవేట్ ఆసుపత్రి లో 60వేలు అవుతుందని,దీంతో పేద ప్రజలు వైద్యం చేయించుకోలేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెల్లడించారు.ప్రభుత్వ ఆసుపత్రి ల్లో సిబ్బంది కొరత కూడా తీవ్రంగా వున్నదని,జిల్లా కేంద్ర ఆసుపత్రి లో ఉన్న కొద్దిమంది కి కూడా జీతాలు నెల నెల ఇవ్వడంలేదన్నారు.వైద్యులు కూడా కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారని ఈ ప్రభావం ఆసుపత్రికి వచ్చే రోగుల పై పడుతుందన్నారు.గ్రామాలలో ఉన్న ఒక్క డా క్టర్ కి మరో రెండు చోట్ల ఇన్చార్జి ఇస్తున్నారని తెలిపారు.ఈ సమస్యలను ఆసరా గా చేసుకొని ప్రవేట్ వైద్యశాలలు ప్రజల ను ఇష్టానుసారం గా దోపిడీ చేస్తున్నాయని ఆరోపించారు. అదేవిధంగా జిల్లా కేంద్రంలో ప్రభుత్వం ఈఎస్ఐ హాస్పటల్ ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.ఇక విద్యా రంగానికి వస్తే ప్రభుత్వం దృష్టి సారించక పోవడం వల్ల సామాన్య ప్రజలకు అందుబాటులో లేకుండా పోయిందన్నారు. ప్రభుత్వ విధానాల వల్ల 70 శాతం మంది విద్యార్థులు ప్రవేట్ పాఠశాలల్లో నే తప్పక చేరుతున్నారన్నారు.పాఠశాలల్లో సరిపడ గదులు లేవని,బాలికలకు మూత్ర శాలలు లేక తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని వెల్లడించారు. ప్రభుత్వం ఇస్తామన్న పెన్షన్ లను వెంటనే పెంచి ఇవ్వాలని డిమాండ్ చేశారు.అలాగే రైతు సంఘాల ఆందోళన ఫలితంగా కేసీఆర్ ప్రభుత్వం రైతు భీమా పథకాన్ని ప్రవేశ పెట్టి అమలు చేసిందని,కానీ ప్రస్తుత ప్రభుత్వం దానిని నిలుపుదల చేసిందని దుయ్య బట్టారు.వెంటనే ప్రీమియం చెల్లించి పథకాన్ని కొనసాగించాలని డిమాండ్ చేశారు.ఈ సమస్యల పరిష్కారం కోసం ఈనెల31న జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద తమ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ శ్రేణులు, అభిమానులు,సానుభూతి పరులు,ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఈ విలేకర్ల సమావేశంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు మాచర్ల భారతి, బండి రమేష్, వై.విక్రం,మాదినేని రమేష్, యర్రా శ్రీనివాస రావు, మెరుగు సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

# నిబంధనలు గాలికి మాడుగులపల్లి ఏఈ ఇష్టారాజ్యం!

- ○ఎస్టిమేషన్ లేకుండానే పోల్స్, ట్రాన్స్‌ఫార్మర్ల షిఫ్టింగ్
- ○భవన నిర్మాణానికి ట్రాన్స్‌ఫార్మర్ నుండి డైరెక్ట్‌గా సర్వీస్ వైర్ లీకేజీ
- ○రైతులపై వివక్ష స్థానిక కాంట్రాక్టర్లకు దక్కని పనులు
- ○మంత్రి చెప్పినా డోంట్ కేర్‌అధికారి తీరుపై తీవ్ర ఆగ్రహం

**మాడుగులపల్లి, ఆగస్టు 27 (జనం సాక్షి):**
విద్యుత్ శాఖ నిబంధనలను బొందపెట్టి, అధికార దుర్వినియోగానికి పాల్పడుతూ మాడుగులపల్లి విద్యుత్ శాఖ ఏఈ (ఏఈ) ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని తీవ్ర ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి మాడుగులపల్లి – కొత్తగూడెం గ్రామాల మధ్య నూతనంగా నిర్మిస్తున్న ఒక భవనం వద్ద ఎటువంటి అధికారిక ఎస్టిమేషన్ లేకుండా, కేవలం తన సొంత నిర్ణయాలతో విద్యుత్ స్తంభాలు, ట్రాన్స్‌ఫార్మర్ షిఫ్టింగ్ పనులను చకచకా కానిచ్చేయడం స్థానికంగా పెద్ద దుమారమే రేపుతోంది

**రైతులపై వివక్ష భవనాలకు దొంగ దారులు!**
సాధారణ రైతులు తమ పొలాల వద్ద విద్యుత్ లైన్ల షిఫ్టింగ్ లేదా కనెక్షన్ల కోసం దరఖాస్తు చేసుకుంటే ముందు ఎస్టిమేషన్ కావాలి అంటూ నెలల తరబడి తిప్పుకునే సదరు అధికారి, భవన నిర్మాణాల వద్దకు వచ్చేసరికి మాత్రం రూల్ బుక్‌ను పక్కనబెడుతున్నారు. భారీగా ఆర్థిక లావాదేవీలు సమకూర్చుకొని తనకిష్టమొచ్చినట్లు పనులు చేస్తున్నారని రైతులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు గతంలో టోల్‌గేట్ సమీపంలో కూడా ఎస్టిమేషన్లు లేకుండానే లైన్లను షిఫ్ట్ చేసినట్లు ఆధారాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు

**లోట్రాన్స్‌ఫార్మర్‌కు డైరెక్ట్ సర్వీస్ వైర్ మీటర్ లేకుండానే కరెంట్ వాడకం!**
నిర్మాణంలో ఉన్న ఆ భవనానికి నిబంధనలకు విరుద్ధంగా వ్యవసాయ విద్యుత్ (అగ్రికల్చర్ పవర్ ) ట్రాన్స్‌ఫార్మర్ నుంచే నేరుగా (డైరెక్ట్ ) సర్వీస్ వైర్లు కలిపి విద్యుత్‌ను వినియోగిస్తుండటం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోంది ఎటువంటి కమర్షియల్ మీటర్ గానీ, అనుమతులు గానీ లేకుండా డైరెక్ట్‌గా వైర్లు కలపడం వల్ల ట్రాన్స్ ఫార్మర్‌పై భారం పడి, వ్యవసాయానికి లో–వోల్టేజ్ సమస్యలు తలెత్తుతాయని రైతులు ఆందోళన చెందుతున్నారు,



**నచ్చితేనే పని స్థానికులకు హుకుం!**
మండలంలోని స్థానిక కాంట్రాక్టర్లను తీవ్రంగా అలసత్వం వహిస్తూ, పక్క మండలాల నుంచి తనకు అనుకూలమైన వారిని పిలిపించుకొని ఏఈ పనులు కేటాయిస్తున్నారు. స్థానిక కాంట్రాక్టర్లు వెళ్లి ప్రశ్నించగా, నాకు నచ్చిన వాళ్లకే పనులు ఇచ్చుకుంటా మీకు ఇవ్వాల్సిన అవసరం లేదు అంటూ తీవ్ర స్థాయిలో హుకుం జారీ చేసిన సందర్భాలు ఉన్నాయని వారు వాపోతున్నారు

**రాష్ట్ర మంత్రి మాటకూ ఖాతరు లేదాయే!**
సదరు అధికారి ఆగడాలు ఏ స్థాయిలో ఉన్నా యంటే.. గతంలో స్వయంగా రాష్ట్ర మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సూచించిన ఒక పనిని కూడా పక్కనబెట్టి, కొన్ని రోజుల పాటు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురిచేసిన చరిత్ర ఈ ఏఈకి ఉంది. మంత్రి మాటనే లెక్క చేయని ఈ అధికారి తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఉన్నతాధికారులు తక్షణమే స్పందించి మాడుగులపల్లి ఏఈ అక్రమాలపై సమగ్ర విచారణ జరిపించాలని, నిబంధనలు ఉల్లంఘించి డైరెక్ట్ కనెక్షన్లు ఇచ్చిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రాంతీయ రైతాంగం, స్థానిక కాంట్రాక్టర్లు డిమాండ్ చేస్తున్నారు.





# చెట్లకు రాఖీ.. పర్యావరణ పరిరక్షణకు బాసట

## ఎర్రగుంట జడ్పీ ఉన్నత పాఠశాలలో వృక్ష రక్షాబంధన్

**అన్నపరెడ్డిపల్లి ఆగస్టు 27 (జనంసాక్షి)**
రాఖీ పండుగను పురస్కరించుకుని అన్నపురెడ్డిపల్లి మండలం ఎర్రగుంట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థులు, ఉపాధ్యాయులు గురువారం వృక్ష రక్షా బంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల ఎకో క్లబ్, నేషనల్ గ్రీన్ కోర్ ఆధ్వర్యంలో పాఠశాల ఆవరణలోని రావి చెట్టుకు ఆకులు, పువ్వులతో తయారు చేసిన రాఖీని కట్టి చెట్ల సంరక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు, మండల విద్యాశాఖాధికారి ఉండేటి ఆనందకుమార్ మాట్లాడుతూ.. రాఖీ పండుగ అన్నాచెల్లెళ్లు, అక్కాతమ్ముళ్ల మధ్య ప్రేమానురాగాలకు, రక్షణకు ప్రతీక అని అన్నారు. అదే స్ఫూర్తితో చెట్లను సోదరులుగా భావించి ప్రతి ఏటా పాఠశాలలో వృక్ష రక్షా బంధన్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. చెట్లు కలకాలం పచ్చగా ఉండి మానవాళికి ఎన్నో విధాలుగా ఉపయోగపడేలా వాటిని సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం అన్నపురెడ్డిపల్లి మండల ప్రజలందరికీ రాఖీ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జి సునందారెడ్డి, ఎకో క్లబ్ ఇంచార్జి మోత్కూరి పద్మ, ఉపాధ్యాయులు బాబురావు, వెంకటేశ్వరరావు, వసంత, మోతిలాల్, జయరాం, ప్రసాద్, కార్యాలయ సిబ్బంది నాగేశ్వరరావు, శిరీష, ఖాసీం, ఎకో క్లబ్ విద్యార్థులు పాల్గొన్నారు.

# పెంట్లంలో ఘనంగా ముత్యాలమ్మ తల్లి బోనాలు

## భక్తిశ్రద్ధలతో బోనమెత్తిన ఆడబిడ్డలు



**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి)**
అన్నపురెడ్డిపల్లి మండల పరిధిలోని పెంట్లం గ్రామ గౌడ్ బజార్‌లో గురువారం ముత్యాలమ్మ తల్లి బోనాల వేడుకలను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. గ్రామానికి చెందిన ఆడబిడ్డలు బోనమెత్తుకుని డప్పువాయిద్యాల నడుమ ఊరేగింపుగా ముత్యాలమ్మ అమ్మవారి ఆలయానికి చేరుకుని మొక్కులు చెల్లించుకున్నారు. గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో ఉండాలని కోరుతూ గ్రామ దేవతలకు నైవేద్యాలు సమర్పించారు. అనంతరం ముత్యాలమ్మ తల్లికి పసుపు, కుంకుమలతో పాటు చీరలను సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పెద్ద గౌడ్ రాచకొండ నాగేశ్వరావు, చెవుగోని సత్యనారాయణ, నర్సింగ్ కృష్ణ, రాచకొండ రామచంద్రు, మందాస్ యల్లయ్య, భూపతి నర్సిహారావు మరియు భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.





# శ్రీ చైతన్య పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**కొత్తగూడెం క్రైమ్, ఆగస్టు 27 (జనంసాక్షి):**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ పట్టణంలోని ఒడ్డుగూడెం లోని శ్రీ చైతన్య పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు ముందస్తు అత్యంత కోలాహలంగా, ఆనందోత్సాహాల మధ్య గురువారం జరిగాయి. ఈ సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులు సాంప్రదాయ దుస్తులు ధరించి ఉత్సాహంగా పాల్గొన్నారు. పాఠశాల చిన్నారులు ఒకరికొకరు రాఖీలు కట్టి, తీపి తినిపించుకుంటూ తమ ప్రేమ అనురాగాన్ని చాటుకున్నారు. మన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవడంతో పాటు అన్నా చెల్లెళ్ల ప్రేమానురాగాలు, రక్షణ భావాన్ని పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని పాఠశాల యాజమాన్యం మరియు ఉపాధ్యాయులు తెలిపారు. చిన్నారుల ముద్దుల రాఖీ ముచ్చట్లు, వారి చిరునవ్వులు పాఠశాలలో పండుగ వాతావరణాన్ని నింపాయి. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ రాణి, ఉపాధ్యాయులు చందన, భవాని, జనిత, భావన విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.




## ఎం ఆర్ పి ఎస్ మండల అధ్యక్షునిగా

# మేకల సతీష్ మాదిగ

**టేకులపల్లి, ఆగస్టు 27(జనంసాక్షి):**
ఎమ్మార్పీఎస్ టేకులపల్లి మండల అధ్యక్షునిగా మేకల సతీష్ మాదిగను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన ఎమ్మార్పీఎస్ సమావేశంలో ఎమ్మార్పీఎస్ మండల ఇన్చార్జి నల్లగట్ల వెంకన్న మాదిగ ఆధ్వర్యంలో ఎమ్మార్పీఎస్ నూతన మండల కమిటీ కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. ఈ కమిటీ కార్యవర్గాన్ని మండల కమిటీని ఏకగ్రీవంగా ప్రకటించారు. ఉపాధ్యక్షులుగాకాళ్ళ రాజా మాదిగ,ప్రధాన కార్యదర్శిగాపోలేపొంగు లక్ష్మన్ మాదిగ,వర్కింగ్ ప్రెసిడెంట్గా గుగ్గిళ్ళ సందీప్ మాదిగ,అధికార ప్రతినిధిగా జనక రాఘవేంద్రరావు మాదిగ, ప్రచార కార్యదర్శిగా కుక్క ముడి శంకర్ మాదిగ,కార్యదర్శిగా పోలె పొంగు పవన్ కళ్యాణ్ మాదిగ, కార్యవర్గసభ్యులుగా జనక శ్రీకాంత్ మాదిగఇస్రం రవి మాదిగ, రాగా ప్రవీణ్ మాదిగ,పోలేపొంగు బాబు మాదిగలను మండల కమిటీ కార్యవర్గాన్ని ప్రకటించారు. ఈ సమావేశాన్ని ఉద్దేశించి మండల ఇన్చార్జి నల్లగట్ల వెంకన్న మాదిగ మాట్లాడుతూ సెప్టెంబర్ 9న వరంగల్ లో జరిగే ఎమ్మార్పీఎస్ జాతీయ సదస్సును జయప్రదం చేయాలని, టేకులపల్లి మండలం నుండి భారీగా తరలి వెళ్లాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ జాతి సదస్సును జయప్రదం చేయడానికి మండల అధ్యక్షులు, మండల కార్యవర్గ సభ్యులు కృషి చేయాలని కోరారు. ఈ సమావేశంలో ఎం ఎస్ పి సీనియర్ నాయకులు జనక ఇస్తారు మాదిగ,చింతల మోహన్ రావు మాదిగ, మెంతిన ప్రభాకర్ మాదిగ, మెంతెన కొండలరావు మాదిగ తదితరులు పాల్గొన్నారు.

# భోపాల్ ట్రైబల్ మ్యూజియం తరహాలో భద్రాచలం మ్యూజియం అభివృద్ధి

## ఐ టి డి ఏ పీవో బి. రాహుల్

**భద్రాచలం ఆగస్టు 27 (జనంసాక్షి)**
భోపాల్‌లోని జాతీయ గిరిజన మ్యూజియం తరహాలో భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంను ఆధునిక హంగులతో అభివృద్ధి చేసి పర్యాటకులను ఆకట్టుకునేలా తీర్చిదిద్దనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. మధ్యప్రదేశ్ రాజధాని భోపాల్‌లోని ఇందిరాగాంధీ రాష్ట్రీయ మానవ సంగ్రహాలయంలోని జాతీయ గిరిజన మ్యూజియంను గురువారం ఐటీడీఏ పీవో బి. రాహుల్, ఐటీడీఏ యూనిట్ అధికారులు సందర్శించారు. మ్యూజియంలోని గిరిజన కళాఖండాలు, పెయింటింగ్‌లు, సాంస్కృతిక వస్తువులు, సంప్రదాయ పద్ధతుల్లో నిర్మించిన ఇళ్లు, కలపతో రూపొందించిన కళాకృతులను పరిశీలించారు. మ్యూజియం డైరెక్టర్ ప్రొఫెసర్ అమితాప్ పాండే ఆధ్వర్యంలో వివిధ అంశాలను అధికారులు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా రాహుల్ మాట్లాడుతూ భోపాల్ జాతీయ గిరిజన మ్యూజియంలోని కళాఖండాలు, పెయింటింగ్‌లు, సంప్రదాయ గిరిజన గృహాల నిర్మాణం అద్భుతంగా ఉన్నాయని అన్నారు. మ్యూజియం వెలుపల పర్యాటకులను ఆకర్షించేలా ఏర్పాటు చేసిన నిర్మాణాలు కూడా ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయని తెలిపారు. అదే స్ఫూర్తితో భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియంను అభివృద్ధి చేస్తామని చెప్పారు. భద్రాచలం ఏజెన్సీ ప్రాంత గిరిజన సంస్కృతి, సంప్రదాయాలు, జీవన విధానానికి సంబంధించిన అరుదైన కళాఖండాలను సేకరించి, వాటిని ఆకర్షణీయమైన రూపకల్పనతో మ్యూజియంలో ఏర్పాటు చేస్తామని తెలిపారు. పర్యాటకులకు గిరిజన సంస్కృతిపై అవగాహన కలిగించడంతో పాటు మ్యూజియం ప్రత్యేక పర్యాటక ఆకర్షణగా నిలిచేలా చర్యలు చేపడతామని పేర్కొన్నారు. అనంతరం భద్రాచలం ఐటీడీఏ ప్రాంగణంలోని గిరిజన మ్యూజియం కాఫీబుక్‌ను ప్రొఫెసర్ అమితాప్ పాండేకు రాహుల్ అందజేశారు. భద్రాచలం ప్రాంత గిరిజన సంస్కృతి, సంప్రదాయాలకు సంబంధించిన వివరాలను ఆయనకు వివరించారు. ఈ కార్యక్రమంలో గిరిజన సంక్షేమ శాఖ ఈఈ మధుకర్, ఏపీవో పవర్ వేణు, ఏవో సున్నం రాంబాబు, మ్యూజియం ఇన్‌చార్జి వీరాస్వామి, జాతీయ గిరిజన మ్యూజియం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.





## కాంగ్రెస్ పార్టీ లోకి భారీ వలసలు..

### ఎం.వి.పాలెంలో సీపీఎంకు బిగ్ షాక్..

**ఖమ్మం రూరల్, ఆగస్టు 27 (జనంసాక్షి)**
ఖమ్మం రూరల్ మండలం ఎం. వెంకటాయపాలెం గ్రామంలో రాజకీయ సమీకరణాలు మారుతున్నాయి. సీపీఎం, బీఆర్ఎస్ పార్టీలకు చెందిన పలువురు నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి క్యాంపు కార్యాలయ ఇన్‌చార్జి తుంబూరు దయాకర్‌రెడ్డి సమక్షంలో గురువారం జరిగిన కార్యక్రమంలో వారికి కాంగ్రెస్ పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. సీపీఎం నాయకులు తమ్మనబోయిన చిన్న వీరయ్య, తమ్మనబోయిన వెంకటరమణ, తమ్మనబోయిన నరేందర్,రామగిరి నాగరాజు, కొమరగిరి అన్నపూర్ణ, రామగిరి పుష్ప, తమ్మనబోయిన పార్వతి, కోసంగి ఉమేష్, శీలం సత్యనారాయణ, శీలం ఈశ్వర్, సామల విజయ్, బీఆర్ఎస్ నుంచి పడిగల నాగేశ్వరరావు తదితరులు కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా తుంబూరు దయాకర్‌రెడ్డి మాట్లాడుతూ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి నాయకత్వంలోనే పాలేరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు వేగంగా కొనసాగుతున్నాయని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు తోట వీరభద్రం, ఖమ్మం మార్కెట్ మాజీ చైర్మన్ మద్ది మల్లారెడ్డి,కాంగ్రెస్ నాయకురాలు మందపల్లి నాగమణి, మద్దెల నాగయ్య, నరసింహ, లింగ శ్రీనివాసరావు, బుర్ర రాజేష్, సోషల్ మీడియా వారియర్ ఆరెంపుల బద్రిసాయి తదితరులు పాల్గొన్నారు.



## జాజిరెడ్డిగూడెం పాఠశాలలో విద్యార్థినిచే మొక్కను నాటిస్తున్న హెచ్ఎం

**జాజిరెడ్డిగూడెం మండల ఆగస్టు 27 (జనంసాక్షి)**
మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని జడ్.పి.హెచ్.ఎస్ జాజిరెడ్డిగూడెం పాఠశాల హెచ్ఎం మంజుల అన్నారు. పాఠశాల విద్యార్థిని తండు భవ్యశ్రీ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం పాఠశాలలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సంపత్, శంకర్, పీడీ సైదులు, మల్లిక, జ్ఞానేశ్వరి, వెంకట్, చంద్రకళ, కరుణ, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

## బుచ్చన్నగూడెంలో ఘనంగా సమ్మక్క-సారక్క జాతర

### అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించిన మాజీ ఎమ్మెల్యే తాటి వెంకటేశ్వర్లు

**అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి)**
అన్నపురెడ్డిపల్లి మండలం బుచ్చన్నగూడెం గ్రామంలో నిర్వహించిన సమ్మక్క?సారక్క జాతర మహోత్సవం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. తాటి భద్రయ్య-శ్రీనివాసమ్మ దంపతుల ఆహ్వానం మేరకు బూర్గంపహాడ్-అశ్వారావుపేట మాజీ ఎమ్మెల్యే, తెలంగాణ రాష్ట్ర తొలి ట్రైకార్ మాజీ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు తాటి వెంకటేశ్వర్లు జాతరలో పాల్గొన్నారు. గ్రామానికి చేరుకున్న తాటి వెంకటేశ్వర్లుకు గ్రామ ప్రజలు, జాతర నిర్వాహకులు ఆత్మీయ స్వాగతం పలికారు. అనంతరం సమ్మక్క?సారక్క అమ్మవార్ల గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించి దర్శించుకున్నారు. జాతర సందర్భంగా నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమాల్లో పాల్గొని అమ్మవార్ల ఆశీస్సులు పొందారు. ఈ సందర్భంగా తాటి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ సమ్మక్క?సారక్క అమ్మవార్లు ప్రజల ఇలవేల్పులుగా, ధైర్యానికి ప్రతీకగా కొలవబడుతున్నారని అన్నారు. అమ్మవార్ల ఆశీస్సులతో అన్నపురెడ్డిపల్లి మండల ప్రజలు, బుచ్చన్నగూడెం గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, బీఆర్ఎస్ నాయకులు వీరబోయిన వెంకటేశ్వర్లు, ఇనపనూరి రాంబాబు, చల్లా రమేష్, పెద్దారపు నాగ రాజు, తాటి భద్రం, పార్టీ కార్యకర్తలు, యువకులు, మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



## అర్వపల్లి ఐటిఐ లో దరఖాస్తులకు ఆహ్వానం

**జాజిరెడ్డిగూడెం మండల**
అర్వపల్లి లోని శ్రీ విజ్ఞాన్ ఐటిఐలో ఈ 2026-27 విద్యా సంవత్సరంనకు గాను దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపల్ గుంటిపల్లి హరికుమార్ గారు గురువారం తెలియజేశారు. ఆసక్తి కలవారు 27-08-2026 నుండి 05-09-2026 వరకు ఆన్లైన్లో దరఖాస్తు చేసుకొని 29-8-2026 నుండి 05-09-2026 వరకు కళాశాలకు మధ్యాహ్నం 1 గంట లోపు10విప్ప మెమో, స్టడీ కండక్ట్ క్యాస్ట్ సర్టిఫికెట్ కళాశాలలో ఇవ్వవలసినదిగా చెప్పారు. కళాశాల యందు గల కోర్సులు ఎలక్ట్రీషియన్, ఫిట్టర్ ఉన్నందున అవకాశాన్ని వినియోగించుకోవాల్సినదిగా చెప్పారు. మరిన్ని వివరాలకు 9492033933, 9110513272 నంబర్లకు సంప్రదించాలన్నారు.

# బెల్ట్ దుకాణాలపై ప్రత్యేక సైన్యంతో తనిఖీలు

### ○మద్యం బాటిళ్లు తీసుకోస్తున్న వైనం.. అధికారులకే సవాల్

### ○ప్రైవేటు వ్యక్తులకు సోదాలు చేసే అధికారం ఎవరిచ్చింది?



**కారేపల్లి, ఆగస్టు 27,(జనంసాక్షి):**
సింగరేణి మండలంలో మద్యం సిండికేట్ వ్యవహారం మరోసారి చర్చనీయాంశంగా మారింది. ఎక్సైజ్ శాఖ నిర్వహించాల్సిన తరహాలోనే సిండికేట్ యాజమాన్యం తమ ప్రత్యేక సైన్యంతో బెల్ట్ దుకాణాలపై సోదాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా కలకలం రేపుతున్నాయి. బెల్ట్ దుకాణాల్లోకి వెళ్లి మద్యం బాటిళ్లను తనిఖీల పేరుతో తీసుకొస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అక్రమ మద్యం విక్రయాలపై తనిఖీలు నిర్వహించి, మద్యం స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేసే అధికారం ఎక్సైజ్ శాఖకు ఉండగా.. సిండికేట్‌కు చెందిన ప్రత్యేక సైన్యం ఎక్సైజ్ సిబ్బందిలా వ్యవహరిస్తూ సోదాలు నిర్వహించడం ఏమిటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. మద్యం దుకాణాల యాజమాన్యం తరపున పనిచేసే వ్యక్తులు గ్రామాల్లోని బెల్ట్ దుకాణాలపై సోదాలు నిర్వహించి మద్యం సీసాలు తీసుకు వెళ్లడానికి ఆ అధికారం ఎవరిచ్చారు? అన్నది తేలాల్సి ఉంది.

**బెల్ట్ దుకాణాల్లోకి వెళ్లి..**
రేలకాయలపల్లి, యర్రబోడు , మంగళి తండా సమీపంలో గల బెల్ట్ దుకాణంలోకి ఇటీవల సిండికేట్‌తో సంబంధం ఉన్నట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రవేట్ సైన్యం వెళ్లి మద్యం బాటిళ్లు తీసుకెళ్లినట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ వ్యవహారంపై ప్రశ్నించిన వారికి "ఎవరికి చెప్పుకుంటారో చెప్పుకోండి" అన్న ధోరణిలో సమాధానాలు ఇచ్చినట్లు స్థానికంగా ప్రచారం జరుగుతోంది.

**ఎక్సైజ్ అధికారులకు తెలియదా?**
బెల్ట్ దుకాణాలపై సోదాలు నిర్వహించి మద్యం స్వాధీనం చేసుకున్నట్లు ఆరోపణలు వస్తున్నా.. ఈ వ్యవహారం ఎక్సైజ్ అధికారుల దృష్టికి వచ్చిందా? లేదా వారి అనుమతితోనే ఈ తనిఖీలు జరుగుతున్నాయా? అన్న ప్రశ్నలు వినిపిస్తున్నాయి. ప్రైవేటు సైన్యం స్వాధీనం చేసుకున్న మద్యం ఎక్కడికి తీసుకెళ్తున్నారు? దానికి సంబంధించిన వివరాలు ఎక్కడ నమోదు చేస్తున్నారు? అనే విషయాలపై స్పష్టత రావాల్సి ఉంది.

**అధికారుల తనిఖీలకు భిన్నంగా..**
మరోవైపు మద్యం దుకాణాల్లో నౌకరినామలో పనిచేస్తున్న సిబ్బంది విషయంలోనూ ఆరోపణలు ఉన్నాయి. రికార్డుల్లో ఒకరి పేర్లు ఉండగా.. వాస్తవంగా దుకాణాల్లో పనిచేస్తున్నది మరొకరనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఎక్సైజ్ అధికారులు ఆకస్మిక తనిఖీలు నిర్వహించి సిబ్బంది వివరాలు, రికార్డులు పరిశీలిస్తే వాస్తవాలు బయటపడతాయని స్థానికులు చెబుతున్నారు.

**ఉన్నతాధికారులు తేల్చాలి**
ఎక్సైజ్ శాఖకు చెందిన అధికారులే నిర్వహించాల్సిన సోదాలను సిండికేట్ యాజమాన్యం ప్రత్యేక సైన్యం నిర్వహిస్తున్నారనే ఆరోపణలు నిజమా? అన్నది ఉన్నతాధికారులు తేల్చాల్సిన అవసరం ఉంది. ఆరోపణలు నిజమైతే బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, అవాస్తవమైతే స్పష్టత ఇవ్వాలని స్థానికులు కోరుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి.. సిండికేట్ యాజమాన్యం, వారి ప్రత్యేక సైన్యంతో, మద్యం దుకాణాల్లోని సిబ్బంది వ్యవహారాలపై సమగ్ర విచారణ చేపట్టాలనే డిమాండ్ వినిపిస్తోంది. ఎక్సైజ్ శాఖకు సమాంతరంగా ప్రైవేటు వ్యక్తులు సోదాలు నిర్వహిస్తున్నారనే ఆరోపణలకు తెరదించాల్సిన బాధ్యత అధికారులపైనే ఉంది.

# చంద్రుగొండ సెయింట్ జోసెఫ్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలు

**చంద్రుగొండ, ఆగస్టు 27 (జనంసాక్షి):** చంద్రుగొండ మండలం అయ్యన్నపాలెం లోని సెయింట్ జోసెఫ్ పాఠశాలలో రక్షాబంధన్ వేడుకలను ప్రిన్సిపాల్ సిస్టర్ లతా ఆధ్వర్యంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ పండుగ ప్రాధాన్యతను చాటిచెప్పారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ సిస్టర్ లతా మాట్లాడుతూ.. రక్షాబంధన్ పండుగ అన్నా చెల్లెళ్ళ, అక్కాతమ్ముళ్ళ మధ్య ప్రేమ, ఆప్యాయత, పరస్పర రక్షణకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. రాఖీ కట్టడం కేవలం ఒక ఆచారం మాత్రమే కాదని, కుటుంబ బంధాలను మరింత బలోపేతం చేసే గొప్ప సంప్రదాయమని తెలిపారు. విద్యార్థులు పరస్పరం ప్రేమ, గౌరవం, సహకార భావంతో మెలగాలని సూచించారు. రక్షాబంధన్ వేడుకల సందర్భంగా పాఠశాలలో విద్యార్థుల్లో సోదర భావం, ఐక్యత, ప్రేమానురాగాలను పెంపొందించే విధంగా వివిధ కార్యక్రమాలను నిర్వహించారు. విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని ఒకరికొకరు రాఖీలు కట్టుకున్నారు. సంప్రదాయ పండుగల విశిష్టతను విద్యార్థులకు తెలియజేయడం ద్వారా భారతీయ సంస్కృతి, కుటుంబ విలువలపై అవగాహన కల్పించడమే కార్యక్రమం ప్రధాన ఉద్దేశ్యమని పాఠశాల నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల కోఆర్డినేటర్ షాహిద్ ఆఫ్రిది, ఉపాధ్యాయులు, విద్యార్థినీ విద్యార్థులు పాల్గొని వేడుకలను విజయవంతం చేశారు.






## తాత్కాలిక మెరిట్ జాబితాలపై
# అభ్యంతరాలకు అవకాశం..
## ఐటీడీఏ పీవో బి రాహుల్..

**భద్రాచలం ఆగస్టు 27 (జనంసాక్షి)**

ఖమ్మం రీజియన్ పరిధిలోని గిరిజన సంక్షేమ గురుకుల విద్యాలయాల్లో 2026?27 విద్యా సంవత్సరానికి తాత్కాలిక ప్రాతిపదికన బోధన సిబ్బంది నియామకానికి సంబంధించి విడుదల చేసిన తాత్కాలిక మెరిట్ జాబితాలపై అభ్యంతరాలు స్వీకరించనున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. అభ్యర్థులు దరఖాస్తు సమయంలో సమర్పించిన వివరాలు, అందుబాటులో ఉన్న రికార్డుల ఆధారంగా తాత్కాలిక మెరిట్ జాబితాలను రూపొందించి విడుదల చేసినట్లు గురువారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జాబితాల్లో తమ పేరు, విద్యార్హతలు, మెరిట్, టెట్ లేదా ఇతర వివరాల్లో తప్పులు ఉన్నట్లయితే తగిన ఆధారాలతో అభ్యంతరాలు తెలియజేయాలని సూచించారు. ఆగస్టు 28 నుంచి 31 వరకు కార్యాలయ పనిదినాల్లో భద్రాచలంలోని ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయం (గురుకులం), ఐటీడీఏలో అభ్యంతరాలను నేరుగా సమర్పించాలని పీవో రాహుల్ తెలిపారు. అభ్యంతరాలకు సంబంధించిన ధ్రువపత్రాల నకళ్లను తప్పనిసరిగా జత చేయాలని, గడువు అనంతరం అందే అభ్యంతరాలను పరిగణనలోకి తీసుకోబోమని స్పష్టం చేశారు. అందిన అభ్యంతరాలను పరిశీలించిన అనంతరం అర్హత, నియామక నిబంధనల ప్రకారం తదుపరి చర్యలు చేపడతామని ఆయన తెలిపారు. మరిన్ని వివరాలకు 9949723291 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.



## పాత గొడవల నేపథ్యంలో
# యువకుడి హత్య

**మణుగూరు, ఆగస్టు 27 (జనంసాక్షి):** పాత గొడవల నేపథ్యంలో యువకుడిపై కొంతమంది వ్యక్తులు దాడి చేసి హత్య చేసిన ఘటన మణుగూరులో గురువారం చోటుచేసుకుంది. పోలీస్ లు తెలిపిన వివరాల ప్రకారం మణుగూరు మండలం గాంధీ బొమ్మ సెంటర్ చెందిన మృతుడు సింహాద్రి శివకుమార్ శివ (28) హైదరాబాద్‌లో ఇంటీరియర్ పనులు చేసుకుంటూ జీవిస్తున్నాడు. శివ వద్ద పనిచేసే సుందరయ్య నగర్ కు చెందిన సతీష్ తో జరిగిన వివాదాన్ని మనసులో పెట్టుకున్న ఎం కె? గ్యాంగ్ శివను మణుగూరు కు వస్తే చంపేస్తామని ఫోన్ ద్వారా బెదిరించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ నేపథ్యంలో గురువారం ఉదయం 07.00 గంటలకు హైదరాబాద్ నుండి మణుగూరుకు వచ్చాడు. ఎం కే గ్యాంగ్ ఫోన్ చేసి శివ ను నేతాజీ గ్రౌండ్ కు రమ్మనగా శివ తన ఇంటి ప్రక్కన ఉన్న ఉదయ్‌కుమార్ తో కలిసి నేతాజీ గ్రౌండ్ కు వెళ్లగా, అక్కడ ముందుగా పథకం ప్రకారం వేచి ఉన్న రమాకాంత్ జెట్టి, భరత్, సాధిక్, వినయ్, ధినేష్, జంపయ్య, ప్రసాద్ తదితరులు శివ పై మూకుమ్మడిగా దాడి చేసినట్లు సి ఐ తెలిపారు. అడ్డుకునేందుకు ప్రయత్నించిన ఉదయ్ కుమార్ పై కూడా దాడి చేశారు. తీవ్రంగా గాయపడిన శివను కుటుంబ సభ్యులు సుమారు మధ్యాహ్నం 12:30 గంటలకు ఆసుపత్రికి తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.



# ఉపాధ్యాయులు, ఉద్యోగులకు క్రీడా సంబరం!

- డివిజన్ స్థాయి ఎంపికలు పూర్తి..
- 29, 30న కిన్నెరసానిలో జిల్లా స్థాయి పోటీలు..

**భద్రాచలం ఆగస్టు 27 (జనంసాక్షి)**

జాతీయ క్రీడా దినోత్సవం, సెప్టెంబర్ 5న నిర్వహించే ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉపాధ్యాయులు, ఉద్యోగులకు ప్రత్యేక క్రీడా పోటీలు నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి బి. రాహుల్ తెలిపారు. గురువారం డివిజన్ స్థాయి క్రీడా ఎంపికలు నిర్వహించినట్లు ఆయన వెల్లడించారు. స్కూల్ కాంప్లెక్స్ స్థాయిలో నిర్వహించిన పోటీల్లో ప్రతిభ కనబరిచి ఎంపికైన క్రీడాకారులు డివిజన్ స్థాయి పోటీల్లో పాల్గొన్నారు. వాలీబాల్, షటిల్ బ్యాడ్మింటన్, టెన్నికాయిట్, క్యారమ్స్, చెస్, షాట్‌పుట్, 60 మీటర్ల పరుగు, క్రికెట్ తదితర క్రీడల్లో పోటీలు నిర్వహించారు. భద్రాచలం డివిజన్‌లో ఉప్పుసాక ఏహెచ్ఎస్, దమ్మపేట డివిజన్‌లో కమలాపురం ఏహెచ్ఎస్, ఇల్లందు డివిజన్‌లో బజ్జాయిగూడెం ఏహెచ్ఎస్, ఖమ్మం డివిజన్‌లో గిరిజన సంక్షేమ పాఠశాలలు, గిరిజన సంక్షేమ గురుకులాలు, ఏకలవ్య గురుకుల పాఠశాలల్లో పోటీలు నిర్వహించారు. డివిజన్ స్థాయిలో ఎంపికైన క్రీడాకారులతో జిల్లా స్థాయి పోటీలను ఈనెల 29, 30 తేదీల్లో కిన్నెరసాని ప్రభుత్వ గిరిజన సంక్షేమ మోడల్ క్రీడా పాఠశాలలో నిర్వహించనున్నట్లు రాహుల్ తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఈనెల 29న ఉదయం 9 గంటలకు కిన్నెరసాని క్రీడా ప్రాంగణంలో తప్పనిసరిగా రిపోర్ట్ చేయాలని సూచించారు. ప్రతి క్రీడాంశంలో డివిజన్ స్థాయి నుంచి రెండు జట్లను ఎంపిక చేసి జిల్లా స్థాయి పోటీలకు పంపనున్నట్లు తెలిపారు. జిల్లా స్థాయికి ఎంపికైన క్రీడాకారులు నిర్ణీత సమయానికి హాజరై సంబంధిత పీడీలు, పీఈటీలు, క్రీడల నిర్వాహకులకు సహకరించాలని ఐటీడీఏ పీఓ బి. రాహుల్ కోరారు.





**ఉయ్యాలవాడలో మొక్కలు నాటుతున్న సర్పంచ్ కరుణ**

**జూజిరెడ్డిగూడెం మండల (జనంసాక్షి):** మొక్కలు నాటి పర్యావరణాన్ని కాపాడాలని ఉయ్యాలవాడ సర్పంచ్ పాశం కరుణ అన్నారు. గురువారం ఉయ్యాలవాడ గ్రామంలో వనమహోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని పలు విధులలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి కావ్య, టి ఏ నాగమణి, ఫీల్డ్ అసిస్టెంట్ ఏడుకొండలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయుల కొరత

- 287 మంది విద్యార్థులు.. 15 మంది ఉపాధ్యాయులు!
- వసతులు కల్పిస్తున్నా.. బోధనకు టీచర్లు కరువు..
- తక్షణమే పరిష్కరించాలని సర్పంచ్ కిషోర్ శివరాం నాయక్ డిమాండ్..

**బూర్గంపహాడ్ ఆగస్టు 27 (జనంసాక్షి)**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలోని మసీద్ రోడ్ ప్రాథమిక పాఠశాలలో నెలకొన్న ఉపాధ్యాయుల కొరత విద్యార్థుల చదువుపై ప్రభావం చూపుతోందని గ్రామపంచాయతీ సర్పంచ్ గుగులోత్ కిషోర్ శివరాం నాయక్ ఆవేదన వ్యక్తం చేశారు. వందలాది మంది విద్యార్థులు చదువుతున్న పాఠశాలలో సరిపడా ఉపాధ్యాయులు లేకపోవడం ఆందోళనకరమన్నారు. పాఠశాలలో ప్రస్తుతం 287 మంది విద్యార్థులు ఉండగా 15 మంది ఉపాధ్యాయులు మాత్రమే విధులు నిర్వహిస్తున్నారని సర్పంచ్ తెలిపారు. గతంలో 20 మంది ఉపాధ్యాయులు ఉండగా.. ఇద్దరు పదవీ విరమణ చేయడంతో పాటు మరో ముగ్గురిని ఇతర పాఠశాలలకు బదిలీ చేయడంతో సిబ్బంది సంఖ్య 15కు తగ్గిందన్నారు. దీంతో విద్యార్థులకు నాణ్యమైన విద్యాబోధన అందించడంలో ఇబ్బందులు ఎదురవుతున్నాయని పేర్కొన్నారు.

**- వసతులు కల్పించాం.. ఉపాధ్యాయులే కరువు!**

పాఠశాల అభివృద్ధికి గ్రామపంచాయతీ తరఫున పెద్దఎత్తున నిధులు వెచ్చిస్తున్నామని కిషోర్ శివరాం నాయక్ తెలిపారు. తాను సర్పంచ్‌గా బాధ్యతలు చేపట్టిన తర్వాత పాఠశాల అభివృద్ధికి రూ.64 లక్షలు, అదనంగా పంచాయతీ తరఫున రూ.12 లక్షల కాంట్రిబ్యూషన్ అందించినట్లు వివరించారు. డిజిటల్ తరగతి గదులతో పాటు విద్యార్థుల సాంస్కృతిక కార్యక్రమాల కోసం ప్రత్యేక వేదిక, క్రీడలకు అవసరమైన వసతులు కల్పించినట్లు చెప్పారు. "పాఠశాలలో అన్ని వసతులు కల్పిస్తున్నాం.. కానీ విద్యాబోధన అందించే ఉపాధ్యాయులు లేకపోతే ఆ వసతుల ప్రయోజనం విద్యార్థులకు ఎలా అందుతుంది?" అని సర్పంచ్ ప్రశ్నించారు.

**- అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం లేదు..**

ఉపాధ్యాయుల కొరత విషయాన్ని మండల విద్యాశాఖ అధికారుల దృష్టికి, జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు జిల్లా కలెక్టర్‌కు కూడా వినతిపత్రం అందించినట్లు సర్పంచ్ తెలిపారు. అయినప్పటికీ సమస్య పరిష్కారం కాకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ముడిపడిన అంశం కావడంతో సంబంధిత అధికారులు సారపాక ప్రాథమిక పాఠశాలపై ప్రత్యేక దృష్టి సారించి అర్హత కలిగిన ఉపాధ్యాయులను తక్షణమే నియమించాలని కోరారు. వ్యక్తిగత లేదా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా విద్యార్థులకు అన్యాయం జరుగుతుందా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని, అధికారులు వాస్తవ పరిస్థితులను పరిశీలించి విద్యార్థుల ప్రయోజనాలను కాపాడాలని సూచించారు.

**- విద్యార్థుల భోజన నాణ్యతపైనా ప్రత్యేక శ్రద్ధ..**

విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజన నాణ్యతను పరిశీలించేందుకు వారంలో రెండు సార్లు పాఠశాలను సందర్శిస్తున్నట్లు సర్పంచ్ తెలిపారు. విద్యార్థులకు మెరుగైన విద్య, నాణ్యమైన భోజనం, అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా గ్రామపంచాయతీ తరఫున తమ వంతు సహకారం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. ఉపాధ్యాయుల కొరత సమస్యను అధికారులు తక్షణమే పరిష్కరించకపోతే మరోసారి జిల్లా కలెక్టర్‌ను కలిసి పాఠశాలలోని సమస్యలను వివరించాల్సి వస్తుందని కిషోర్ శివరాం నాయక్ తెలిపారు.





## విద్యార్థులతో వర్చువల్ గా ప్రధాని మోడీ సంభాషణ




**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 27 (జనంసాక్షి):** మేరా భారత్ కే లో ఇండియా యువ సంవాద్ కార్యక్రమంలో భాగంగా, గురువారం స్థానిక కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాల కాళోజీ నారాయణరావు సెమినార్ హాల్ నందు మేరా యువభారత్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడల దినోత్సవం సందర్భంగా కేలో ఇండియా యువ సంవాద్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో భాగంగా విద్యార్థులను ఉద్దేశించి భారత ప్రధానమంత్రి నరేంద్ర మోడీ వర్చువల్ గా మాట్లాడటం జరిగింది. విద్యార్థులకు క్రీడలు చాలా అవసరమని క్రీడల వల్ల మానసిక ఉల్లాసం కలుగుతుందని మరియు దేశానికి, రాష్ట్రానికి క్రీడల వల్ల మంచి పేరు, ప్రఖ్యాతలు తీసుకురావచ్చు అని తెలియజేశారు. కావున విద్యార్థులు క్రీడల పట్ల ఆసక్తిని పెంచుకోవాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మన కళాశాల ఎన్ఎస్ఎస్, యన్ సి సి మరియు స్పోర్ట్స్ విద్యార్థులు పాల్గొన్నారు. ఇంకా ఈ కార్యక్రమంలో మేరా యువ భారత్ సమన్వయకర్త పాపయ్య, కళాశాల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ శ్రీ కోట అప్పిరెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్. కె.వి.రమణారావు కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ డాక్టర్. ఎం. రంగారావు, ఐక్యుఎసి కోఆర్డినేటర్ అజయ్ కుమార్ చైతన్య,యన్ సి సి ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్లు రాజశేఖర్, వంశీ ప్రియ, లక్ష్మణ్ మరియు పి.డి ఉపేందర్ విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై బిజెపి ధర్నా

**ఖమ్మం కార్పొరేషన్, ఆగస్టు 27 (జనంసాక్షి)**
రాష్ట్రవ్యాప్తంగా విద్యాసంస్థలకు ప్రభుత్వం చెల్లించాల్సిన ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ ఖమ్మం నగరంలో భారతీయ జనతా పార్టీ చేపట్టిన ఆందోళన తీవ్ర ఉద్రిక్తతకు దారి తీసింది. బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో గురువారం జెడ్పీ సెంటర్ వద్ద పార్టీ శ్రేణులు కదం తొక్కాయి. శాంతియుతంగా నిరసన తెలుపుతున్న నాయకులను పోలీసులు అడ్డుకోవడంతో ఇరువర్గాల మధ్య వాగ్వాదం పెరిగి తోపులాటకు దారితీసింది. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షులు నెల్లూరి కోటేశ్వరరావు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేద, మధ్యతరగతి విద్యార్థుల ఉన్నత చదువుల ఆకాంక్షను రాష్ట్ర ప్రభుత్వం దారుణంగా నీరుగారుస్తోందని ఆయన మండిపడ్డారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల సాధన కోసం బీజేపీ గత నెల రోజులుగా అలుపెరగని పోరాటం చేస్తోందని గుర్తుచేశారు. బకాయిలు పేరుకుపోవడంతో రాష్ట్రవ్యాప్తంగా సుమారు 40 లక్షల కుటుంబాలు తీవ్ర మనోవేదనకు గురవుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గత ఎనిమిదేళ్లుగా కళాశాలలకు కనీస నిర్వహణ నిధులు అందక, విద్యాసంస్థలు తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కొట్టుమిట్టాడుతున్నాయని స్పష్టం చేశారు. ఫీజులు చెల్లించనిదే విద్యార్థులకు యాజమాన్యాలు ఒరిజినల్ సర్టిఫికెట్లు ఇవ్వడం లేదని, దీంతో చదువు పూర్తయినా ఉద్యోగాలకు వెళ్లలేక యువత రోడ్డున పడుతోందని, ప్రభుత్వాన్ని నిలదీశారు. పాలిటెక్నిక్ కళాశాలలను సందర్శించి విద్యార్థుల సమస్యలు తెలుసుకుందామనుకున్న నాయకులను నిజాం కాలం నాటి తరహాలో గృహనిర్బంధాలు చేయడం, అక్రమంగా అరెస్టులు చేయడం ఈ ప్రభుత్వ నిరంకుశత్వానికి పరాకాష్ట అని కోటేశ్వరరావు ధ్వజమెత్తారు. పాలకులు తమ స్వలాభం కోసం రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని, విద్యార్థుల భవిష్యత్తును గాలికి వదిలేశారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో శ్యామ్ రాథోడ్, నున్న రవి కుమార్ , అల్లిక అంజయ్య, కొణతం లక్ష్మీనారాయణ, నకిరేకంటి వీరభద్రం, శ్రీరామనేని మణి , మంద సరస్వతి ,శాసనాలు సాయిరాం, పమ్మి అనిత, ఆర్ వి ఎస్ యాదవ్, రుద్ర గాని మాధవ్ బి.కొండ శ్యామ్, శ్రీ లక్ష్మీ రెడ్డి, ఫణి కుమారి, స్వర్ణ, భద్రం , గోనెల శివ తదితరులు పాల్గొన్నారు.



## ఓట్లపై ఆందోళన..
## గ్రామసభకు అధికారుల గైర్హాజర్ ..

**○ వాటర్ జాబితా చదివి వినిపించాల్సి ఉండగా హాజరుకాని రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు**

**బూర్గంపహాడ్ ఆగస్టు 27 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సారపాక మేజర్ గ్రామపంచాయతీ పరిధిలో గురువారం ఉదయం 10:30 గంటలకు నిర్వహించాల్సిన గ్రామసభకు సంబంధిత రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు హాజరుకాకపోవడంతో గ్రామసభకు వచ్చిన ప్రజలు తీవ్ర నిరాశకు గురయ్యారు. ఓటర్ల ముసాయిదా జాబితాను చదివి వినిపించడంతో పాటు అభ్యంతరాలు, ఆధారాలను స్వీకరించాల్సిన కీలకమైన సమయంలో అధికారులు గైర్హాజరు కావడంపై స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల సారపాకలో నిర్వహించిన సర్ ప్రక్రియలో దాదాపు 6 వేల ఓట్లు తొలగించబడ్డాయని, పలువురు ఓటర్లకు నోటీసులు జారీ అయ్యాయని స్థానిక బీఆర్ఎస్ నాయకులు పేర్కొన్నారు. నోటీసులు అందజేయడంలోనూ తీవ్ర జాప్యం జరిగిందని, దీంతో తమ ఓటు హక్కును కాపాడుకునేందుకు అవసరమైన పత్రాలు సమర్పించుకునే అవకాశం కోసం ప్రజలు ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఈ నేపథ్యంలో గ్రామసభ ద్వారా ఓటర్లు తమ వద్ద ఉన్న సరైన ఆధారాలను సమర్పించి, తొలగింపుపై అభ్యంతరాలు వ్యక్తం చేసేందుకు అవకాశం ఉంటుందని భావించగా.. గ్రామసభకు సంబంధిత అధికారులు హాజరుకాకపోవడంతో ప్రజలు నిరాశకు గురయ్యారు. చాలాసేపు ఎదురుచూసిన పలువురు ప్రజలు అధికారులు రాకపోవడంతో చేసేదేమీ లేక ఇళ్లకు తిరిగి వెళ్లిపోయారు.

**- ఇంకా దాదాపు 2 వేల ఓట్లు తొలగిపోయే అవకాశం..**

ఇంకా దాదాపు 2 వేల ఓట్లు తొలగిపోయే అవకాశం ఉందని స్థానిక బీఆర్ఎస్ నాయకులు ఆందోళన వ్యక్తం చేశారు. ఓటర్ల జాబితా సవరణ వంటి అత్యంత కీలకమైన ప్రక్రియలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే అర్హులైన ఓటర్లు తమ ఓటు హక్కును కోల్పోయే ప్రమాదం ఉందని పేర్కొన్నారు. గ్రామసభకు రెవెన్యూ అధికారులు, బీఎల్ఓలు ఎందుకు హాజరుకాలేదో అధికారులు స్పష్టత ఇవ్వాలని స్థానికులు డిమాండ్ చేస్తున్నారు. గ్రామసభ వాయిదా పడిందా? లేక నిర్వహణపై అధికారులకు సరైన సమాచారం లేదా? అనే విషయాలను వెల్లడించాలని కోరుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి, పెండింగ్‌లో ఉన్న సర్ ప్రక్రియను వేగవంతం చేసి, అర్హులైన ప్రతి ఓటరుకు తమ అభ్యంతరాలు, ఆధారాలు సమర్పించుకునే అవకాశం కల్పించాలని బీఆర్ఎస్ పార్టీ గ్రామ ప్రజల తరఫున కోరింది.



## ఇరవెండిలో ఓటర్ల జాబితాపై గ్రామసభ

**○ డ్రాఫ్ట్ జాబితా పరిశీలన.. సవరణలు, కొత్త నమోదుకు దరఖాస్తుల స్వీకరణ**

**బూర్గంపహాడ్ ఆగస్టు 27 (జనంసాక్షి)**
భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, బూర్గంపహాడ్ మండలం ఇరవెండి గ్రామపంచాయతీ పరిధిలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమంలో భాగంగా గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాతో పాటు తప్పులు, అనుసంధానం కాని వివరాలు, అనుమానాస్పదంగా ఉన్న ఓటర్ల జాబితాలను ప్రజల సమక్షంలో పరిశీలించారు. బూత్ స్థాయి అధికారి పర్యవేక్షకుడు చంద్రయ్య ముఖ్య అతిథిగా హాజరై కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. సర్పంచ్ గుండు బాబురావు అధ్యక్షత వహించగా, ఉపసర్పంచ్ మహంకాళి రామారావు పాల్గొన్నారు. ఉదయం 10 గంటలకు నిర్వహించిన గ్రామసభలో డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాను ప్రజలకు చదివి వినిపించారు. ఓటర్ల జాబితాలో పేర్ల నమోదు, తొలగింపు, తప్పుల సవరణలకు సంబంధించిన దరఖాస్తులను స్వీకరించారు. ప్రతి ఒక్కరూ తమ ఓటరు వివరాలను పరిశీలించుకుని, ఏవైనా పొరపాట్లు ఉంటే సంబంధిత పత్రాలతో సవరణకు దరఖాస్తు చేసుకోవాలని అధికారులు సూచించారు. అవసరమైన గుర్తింపు పత్రాలతో హాజరై కార్యక్రమానికి సహకరించాలని బూత్ స్థాయి అధికారి పర్యవేక్షకుడు చంద్రయ్య కోరారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు, గ్రామ స్థాయి అధికారులు, బూత్ స్థాయి ప్రతినిధులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.




## వనమహోత్సవంలో ఔషధ మొక్కల వితరణ

**పచ్చదనంతో పాటు ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యం.. సంరక్షణపై అవగాహన**

**బూర్గంపహాడ్ ఆగస్టు 27 (జనంసాక్షి)**
వనమహోత్సవాన్ని పురస్కరించుకుని పర్యావరణ పరిరక్షణతో పాటు ప్రజల్లో ఔషధ మొక్కల పెంపకంపై అవగాహన కల్పించే ఉద్దేశంతో బూర్గంపహాడ్ మండలానికి చెందిన 'ఒక హృదయం' స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఔషధ మొక్కల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా సిరిసిల్ల పరిధిలోని బోయినపల్లి, ఆర్లపల్లి మండలంలోని ఐకేపీ కార్యాలయం తదితర ప్రాంతాల్లో ప్రజలకు వివిధ రకాల ఔషధ మొక్కలను అందజేశారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ.. మొక్కలు నాటడం మాత్రమే కాకుండా వాటిని కాపాడటం ద్వారా మాత్రమే వనమహోత్సవం ఆశయం నెరవేరు తుందని తెలిపారు. పర్యావరణ సమతుల్యతను కాపాడేందుకు ప్రతి ఒక్కరూ తమ పరిసరాల్లో మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతను తీసుకోవాలని సూచించారు. ఔషధ మొక్కలు అందించే ఆరోగ్య ప్రయోజనాలను ప్రజలకు వివరించడంతో పాటు, ఇంటి పరిసరాల్లో వాటిని పెంచుకునే విధానం, సంరక్షణపై అవగాహన కల్పించినట్లు తెలిపారు. వనమహోత్సవాన్ని ఒకరోజు కార్యక్రమంగా కాకుండా నిరంతర ఉద్యమంగా కొనసాగిస్తూ పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరూ మొక్కలు నాటడంతో పాటు వాటి సంరక్షణకు ప్రాధాన్యం ఇవ్వాలని, భవిష్యత్ తరాలకు ఆరోగ్యకరమైన పర్యావరణాన్ని అందించేందుకు తమ వంతు బాధ్యతగా మొక్కలను కాపాడాలని నిర్వాహకులు కోరారు.



# ఓటరు జాబితా సవరణ నోటీసులపై ఆందోళన వద్దు

◆చందేపల్లి, చామపూర్ గ్రామాల్లో ప్రజలకు అవగాహన

◆వివరాలు అందజేసి ఓటు హక్కును కాపాడుకోవాలి: జీపీవో మెరుగు మహేష్



**మోటకొండూరు, ఆగస్టు 27 (జనంసాక్షి):** ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ, మ్యాపింగ్ ప్రక్రియపై ప్రజలకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పించేందుకు మోటకొండూరు మండలంలోని చందేపల్లి, చామపూర్ గ్రామాల్లో జీపీవో మెరుగు మహేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జీపీవో మహేష్ మాట్లాడుతూ... ఓటర్ల జాబితాలో ఓటర్ల పేర్లు లేదా వారి తల్లిదండ్రుల పేర్లు తప్పుగా నమోదు కావడం, ఓటరు లిస్టులో ఉన్న పేరుకు మరియు ఆధార్ వివరాలకు పొంతన లేకపోవడం, రెండు చోట్ల ఓట్లు ఉండటం వంటి కారణాలతో కొంతమందికి అధికారుల నుంచి నోటీసులు జారీ చేస్తున్నట్లు తెలిపారు. అయితే, ఈ నోటీసులు అందుకున్న ప్రజలు ఎలాంటి భయాందోళనలకు గురికావాల్సిన అవసరం లేదని ఆయన స్పష్టం చేశారు. నోటీసులు వచ్చిన వెంటనే అధికారులు అడిగిన పూర్తి వివరాలు, సరైన ధృవీకరణ పత్రాలు అందజేసి పొరపాట్లను సరిచేసుకోవచ్చని సూచించారు. ప్రజలు తమ సందేహాలను నివృత్తి చేసుకుని, తమ అమూల్యమైన ఓటు హక్కును కాపాడుకోవాలని కోరారు. ఈ అవగాహన కార్యక్రమానికి పూర్తిస్థాయిలో సహకారం అందించిన చందపల్లి సర్పంచ్ బోట్ల నాగేష్, చామపూర్ సర్పంచ్ వాటి లింగారెడ్డిలకు ఆయన ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక వార్డు సభ్యులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.



# ఆడపిల్లలను వేధిస్తే కఠిన చర్యలు

**ఎస్సై గోపతి సతీష్- ఎస్.ఎఫ్.ఐ ఆధ్వర్యంలో రాఖీ పండుగ**

**రామన్నపేట, ఆగస్టు 27 (జనంసాక్షి):** ఆడపిల్లలను వేధింపులకు గురిచేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని రామన్నపేట ఎస్ఐ గోపతి సతీష్ హెచ్చరించారు. విద్యార్థినులు, యువతులు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను పోలీసుల దృష్టికి తీసుకురావాలని ఆయన సూచించారు. రాఖీ పండుగ సందర్భంగా ఎస్ఎఫ్ఐ మండల కమిటీ ఆధ్వర్యంలో ఆడపిల్లలకు రక్షణ కల్పించాలని కోరుతూ రామన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ గోపతి సతీష్‌తో పాటు పోలీసు సిబ్బందికి రాఖీలు కట్టి రక్షణ కోరారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ.. మహిళలు, ఆడపిల్లల భద్రతకు పోలీస్ శాఖ అధిక ప్రాధాన్యత ఇస్తుందని తెలిపారు. ఆడపిల్లలను ఎవరైనా వేధించినా, అసభ్యంగా ప్రవర్తించినా, సోషల్ మీడియా ద్వారా ఇబ్బందులకు గురిచేసినా వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. ఫిర్యాదు చేయడానికి భయపడాల్సిన అవసరం లేదని, బాధితులకు పోలీసులు అండగా ఉంటారని పేర్కొన్నారు. మహిళలు, విద్యార్థినుల భద్రతకు భంగం కలిగించే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు. విద్యార్థినులు కూడా అపరిచిత వ్యక్తులతో జాగ్రత్తగా ఉండాలని, సోషల్ మీడియాను బాధ్యతగా వినియోగించాలని ఎస్సై సూచించారు. రాఖీ పండుగ సందర్భంగా ఆడపిల్లల రక్షణ కోసం ఎస్ఎఫ్ఐ చేపట్టిన కార్యక్రమాన్ని ఆయన అభినందించారు.

### క్రీస్తు శేషులు మహమ్మద్ జహంగీర్ జయంతి సందర్భంగా

# వృద్ధాశ్రమంలో పండ్ల పంపిణీ

**వృద్ధుల ఆశీస్సులతో జహంగీర్ జయంతి వేడుకలు**

**కొండమల్లేపల్లి, ఆగస్టు 27 (జనంసాక్షి):** క్రీస్తు శేషులు మహమ్మద్ జహంగీర్ జయంతి సందర్భంగా వారి తమ్ముళ్లు, కుటుంబ సభ్యులు మరియు స్నేహితులు కలిసి దేవరకొండ పట్టణంలోని మహాలక్ష్మి మహిళా మండలి వృద్ధాశ్రమాన్ని సందర్శించి వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వృద్ధులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలను తెలుసుకున్నారు. జహంగీర్ జయంతిని సేవా కార్యక్రమంగా నిర్వహించడం ద్వారా ఆయన సేవాభావాన్ని స్మరించుకున్నట్లు నిర్వాహకులు తెలిపారు. వృద్ధులు అందరికీ ఆశీర్వాదాలు అందిస్తూ ఇలాంటి సేవా కార్యక్రమాలు సమాజానికి ఆదర్శంగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జహంగీర్ తమ్ముళ్లు, స్నేహితులు, ఇమ్రాన్, రియాజ్, ఆమెర్, గఫ్ఫార్, గౌస్,తోసిఫ్,జమీల్, ఫయాజ్, కుటుంబ సభ్యులు, వృద్ధాశ్రమ నిర్వాహకులు పాల్గొన్నారు. సేవా కార్యక్రమాల ద్వారా మహమ్మద్ జహంగీర్ జ్ఞాపకాలను చిరస్థాయిగా నిలుపుకుంటామని వారు పేర్కొన్నారు.





# మహిళా సమాఖ్య అధ్యక్షురాలిగా అలివేలు



**చౌటుప్పల్, ఆగస్టు 27(జనంసాక్షి)** చౌటుప్పల్ మండల మహిళా సమాఖ్య నూతన కార్యవర్గ ఎన్నికలు గురువారం జరిగాయి. జిల్లా స్థాయి ఎలక్షన్ ఆఫీసర్, డి.పి.ఎమ్ కట్ట వెంకటేశం పర్యవేక్షణలో ఈ ఎన్నికల ప్రక్రియ కొనసాగింది. మండలంలోని అన్ని సంఘ బంధాల అధ్యక్షులు ఈ కార్యక్రమం లో పాల్గొని తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. ముందుగా సంఘ బంధాల అధ్యక్షుల నుంచి కార్యనిర్వాహక కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. అనంతరం ఆ ఈసీ సభ్యుల నుండి మండల మహిళా సమాఖ్య నూతన ఆఫీస్ బేరర్లను ఎన్నుకున్నారు. అధ్యక్షురాలిగా కొలుకులపల్లి అలివేలు, కార్యదర్శిగా తీగుళ్ల రమణ, కోశాధికారిగా సుమలతలు ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఎన్నికల అధికారి కట్ట వెంకటేశం మాట్లాడుతూ... నూతనంగా ఎన్నికైన ప్రతినిధులు మహిళా సంఘాల బలోపేతానికి, మహిళల ఆర్థికాభివృద్ధికి నిరంతరం కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్,ఊరి పక్క యాదయ్య, సీసీలు విమల, నరసింహ, కల్పన, అకౌంటెంట్ ఇందిర, మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### మహిళా రక్షణ చట్టాలను కఠినంగా అమలు చేయాలని వినతి

### చౌటుప్పల్ సిఐ కి రాఖీ కట్టిన విద్యార్థినులు



**చౌటుప్పల్, ఆగస్టు 27 (జనంసాక్షి)** ఆడపిల్లలకు సమాజంలో సంపూర్ణ రక్షణ కల్పించడంతో పాటు, వారు స్వేచ్ఛగా చదువుకొని ఉన్నత స్థాయికి ఎదిగేలా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల గర్ల్స్ కన్వీనర్ పల్సం సృజన డిమాండ్ చేశారు. రక్షాబంధన్ సందర్భంగా ఎస్ఎఫ్ఐ చౌటుప్పల్ మండల కమిటీ, నలంద డిగ్రీ కళాశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో గురువారం సీఐ మన్మధ కుమార్‌కు రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సమాజంలో మహిళలు, బాలికలపై జరుగుతున్న అఘాయిత్యాలను అరికట్టడంలో పోలీస్ శాఖ మరింత కఠినంగా వ్యవహరించాలన్నారు. బాలికలకు అండగా నిలిచి భద్రతపై భరోసా కల్పించాలని కోరారు. నేరస్థుల్లో భయం కలిగేలా మహిళా రక్షణ చట్టాలను సమర్థవంతంగా అమలు చేయాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో బాల్యవివాహాలను అరికట్టేందుకు అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ మండల అధ్యక్ష, కార్యదర్శులు దాసరి ప్రకాష్, తిగుళ్ళ శ్రీనివాస్, నాయకులు సుర్వి అరవింద్, పోలేపల్లి మల్లేష్, చంద్రిక, శ్రీవల్లి, పావని, శిరీష, దీప తదితరులు పాల్గొన్నారు.

# ఆర్థిక ఇబ్బందులు తాళలేక యువకుడు ఆత్మహత్య



చౌటుప్పల్, ఆగస్టు 27(జనం సాక్షి) ఉపాధి కోసం వలస వచ్చిన ఓ యువకుడు పని దొరక్క, ఆర్థిక ఇబ్బందులు తాళలేక ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న సంఘటన చౌటుప్పల్ పట్టణంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... శ్రీకాకుళం జిల్లా సోంపేట మండలం జింకీభద్ర గ్రామానికి చెందిన అంబటి జానకిరావు (32) తన బతుకుతెరువు కోసం రెండేళ్ల క్రితం చౌటుప్పల్ పట్టణానికి వచ్చి నివాసముంటున్నాడు. గత నాలుగైదు రోజుల నుంచి అతనికి సరిగా పని దొరకకపోవడంతో ఇంట్లోనే ఉంటున్నాడు. ఈ క్రమంలో ఆర్థిక పరిస్థితులు క్షీణించి తీవ్ర మనస్థాపానికి గురైన జానకిరావు, బుధవారం రాత్రి 11:30 గంటల సమయంలో తన గదిలో చున్నీతో ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ మేరకు మృతుడి తమ్ముడు అంబటి జోగారావు ఇచ్చిన ఫిర్యాదు మేరకు చౌటుప్పల్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

# సాయిరాం యాదవ్ -మౌనికలకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్ ఆశీస్సులు




**గుర్రంపోడు: ఆగస్టు 27 (జనంసాక్షి)** హైదరాబాద్ నగరంలోని శ్రీ మంత్ర కన్వెన్షన్‌లో నాగార్జునసాగర్ నియోజకవర్గ బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు కదారి అంజయ్య యాదవ్ కుమారుడు సాయిరాం యాదవ్, మౌనికల వివాహ వేడుక ఘనంగా జరిగింది. ఈ వివాహ వేడుకకు బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పీజీఆర్ ముఖ్య అతిథిగా హాజరై నూతన వధూవరులు సాయిరాం యాదవ్, మౌనికలను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపిన పీజీఆర్, వారి వైవాహిక జీవితం సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో నిండు నూరేళ్లు కొనసాగాలని ఆకాంక్షించారు. వివాహ వేడుకకు హాజరైన పీజీఆర్‌ను కదారి అంజయ్య యాదవ్ కుటుంబ సభ్యులు సాదరంగా ఆహ్వానించారు. నూతన వధూవరులను ఆశీర్వదించి వారి కుటుంబ సభ్యులతో పీజీఆర్ ఆప్యాయంగా ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ రాష్ట్ర నాయకులు పిజిఆర్, మునుకుంట్ల రాజేష్ రెడ్డి, ఎల్.ఎన్. రెడ్డి, వేముల యాదయ్య, జాల మల్లేష్ తదితరులు పాల్గొని నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపారు. వివాహ వేడుకలో బంధుమిత్రులు, నాయకులు, అభిమానుల సందడి నెలకొంది.

# రూ.500 బోనస్ రావాలంటే పంట వివరాల నమోదు తప్పనిసరి

◆సెప్టెంబర్ 10లోపు నమోదు పూర్తి చేయాలి ◆మండల వ్యవసాయ అధికారి గంటా హర్షిత

**తిరుమలగిరి (సాగర్), ఆగస్టు 27 (జనంసాక్షి):** వానాకాలం-2026 సీజన్‌లో ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న వరి రకాలను సాగు చేసిన రైతులకు క్వింటాల్ ధాన్యానికి రూ.500 చొప్పున బోనస్ అందించనున్నట్లు మండల వ్యవసాయ అధికారి గంటా హర్షిత తెలిపారు. బోనస్‌కు అర్హులైన రైతుల పంట వివరాల నమోదు ప్రక్రియ కొనసాగుతోందని పేర్కొన్నారు. ప్రభుత్వం గుర్తించిన సన్న వరి రకాల్లో బీపీటీ 5204 (సాంబ మసూరి), ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 ఉన్నాయని తెలిపారు. ఈ రకాలను సాగు చేసిన రైతులు తప్పనిసరిగా తమ పంట వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు విత్తనాల కొనుగోలు రసీదు, పట్టాదారు పాస్‌బుక్ తీసుకెళ్లి సంబంధిత డీలర్ ద్వారా పంట వివరాలను ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయించుకోవాలని తెలిపారు. సొంత విత్తనాలతో సాగు చేసిన రైతుల వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారులు నమోదు చేస్తారని, అనంతరం మండల వ్యవసాయ అధికారులు పరిశీలించి ధ్రువీకరిస్తారని వివరించారు. సెప్టెంబర్ 10, 2026లోపు రైతుల పంట వివరాల నమోదు ప్రక్రియను పూర్తి చేయాలని వ్యవసాయ శాఖ సూచించింది. రైతులు ఎలాంటి ఆలస్యం చేయకుండా తమ వరి రకం, సాగు విస్తీర్ణం తదితర వివరాలను సంబంధిత డీలర్ లేదా వ్యవసాయ విస్తరణ అధికారి వద్ద నమోదు చేయించుకుని ప్రభుత్వ బోనస్ పొందాలని మండల వ్యవసాయ అధికారి గంటా హర్షిత కోరారు.





## హాలియా మున్సిపాలిటీలో ఓటర్ల జాబితాపై ప్రత్యేక అవగాహన

**హాలియా, ఆగస్టు 27 జనం సాక్షి:** హాలియా మున్సిపాలిటీ పరిధిలోని అన్ని వార్డుల్లో ప్రత్యేక సమగ్ర సవరణలో భాగంగా, ఓటర్ల జాబితాలో గుర్తింపు కాని వివరాలు, పొరపాట్లు ఉన్న ఓటర్లకు అవగాహన కల్పించేందుకు వార్డు సభలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల ఓటర్ల జాబితాలను ప్రజలకు చదివి వినిపించారు. జాబితాలో పేర్లు, చిరునామాలు, ఇతర వివరాల్లో ఏవైనా తప్పులు లేదా అభ్యంతరాలు ఉంటే సంబంధిత ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకెళ్లి సరిదిద్దుకునే అవకాశం ఉందని అధికారులు వివరించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఒక్క ఓటు కూడా కోల్పోకుండా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. నోటీసులు అందుకున్న ఓటర్లు ఆగస్టు 28 నుంచి సెప్టెంబరు 1వ తేదీ వరకు తమకు సంబంధించిన ధ్రువపత్రాలతో ఎన్నికల అధికారి వద్ద హాజరై, ఓటర్ల జాబితాలో ఉన్న పొరపాట్లను సరిదిద్దుకోవాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమానికి హాలియా మున్సిపల్ చైర్మన్ చింతల చంద్రారెడ్డి ముఖ్య అతిథిగా హాజరై, ప్రజలు ఓటర్ల జాబితాను పరిశీలించి అవసరమైన సవరణలు చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కె. రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు, పోలింగ్ కేంద్రాల స్థాయి అధికారులు, సంబంధిత సిబ్బంది, పోలింగ్ కేంద్రాల ప్రతినిధులు, వార్డు ప్రజలు పాల్గొన్నారు.



# ముందస్తుగా రాఖీ వేడుకలు

### ట్రినిటీ పాఠశాలలో ఘనంగా రక్షాబంధన్ వేడుకలు

**చౌటుప్పల్ ఆగస్టు27(జనం సాక్షి )** మండల కేంద్రంలోని ట్రినిటీ పాఠశాలలో గురువారం ముందస్తు రాఖీ పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రిన్సిపల్ డా.ఉజ్జిని మంజుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా సోదరీమణులు తమ సోదరులకు రాఖీలు కట్టి రక్షాబంధన్ శుభాకాంక్షలు తెలిపారు. విద్యార్థుల్లో సోదరభావం, ప్రేమ, ఆత్మీయ అనుబంధం వంటి విలువలను పెంపొందించేందుకు రక్షాబంధన్ వేడుకలు దోహదపడతాయని వారు వివరించారు. రాఖీ పండుగ ప్రాధాన్యతను విద్యార్థులకు తెలియజేస్తూ సోదరసోదరీమణుల మధ్య ఉండే ప్రేమ, అనుబంధం, పరస్పర గౌరవం గురించి ఉపాధ్యాయులు వివరించారు. పాఠశాలలో నిర్వహించిన వేడుకల్లో విద్యార్థులు ఆనందోత్సాహాలతో పాల్గొన్నారు.

## సన్న రకం వరి రైతులకు క్వింటాకు రూ.500 బోనస్

**హాలియా, ఆగస్టు 27 జనం సాక్షి :** వానాకాలం 2026లో ప్రభుత్వం గుర్తించిన ఏడు రకాల సన్న రకం వరిని సాగు చేస్తున్న రైతులకు క్వింటాలుకు రూ.500 చొప్పున బోనస్ అందించనున్నట్లు మండల వ్యవసాయ శాఖ అధికారులు తెలిపారు. ప్రభుత్వం గుర్తించిన బీపీటీ 5204 (దొంగరమునసులు), ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జైశ్రీరామ్, కేఎన్ఎం 1638, డబ్ల్యూజీఎల్ 44, కేఎన్ఎం 7715 రకాల్లో ఏదైనా సాగు చేసిన రైతులు బోనస్‌కు అర్హులని పేర్కొన్నారు. డీలర్ల వద్ద సన్న రకం వరి విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు తమ విత్తనాల కొనుగోలు వివరాలను సంబంధిత డీలర్ ద్వారా విత్తనాల నమోదు వేదికలో తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలని సూచించారు. అనంతరం వ్యవసాయ శాఖ సిబ్బంది వివరాలను పరిశీలించి ధ్రువీకరిస్తారని తెలిపారు. రైతులు విత్తనాల కొనుగోలు రసీదు, విత్తనాల ప్యాకెట్ వివరాలు, ఇతర అవసరమైన ఆధారాలను భద్రపరచుకోవాలని సూచించారు. సన్న రకం వరి సాగు చేసినట్లు నిర్ధారణ అయిన అర్హులైన రైతులకు మాత్రమే ప్రభుత్వం ప్రకటించిన బోనస్ అందుతుందని స్పష్టం చేశారు. విత్తనాల కొనుగోలు వివరాలను సెప్టెంబరు 10వ తేదీలోపు తప్పనిసరిగా నమోదు చేయించుకోవాలి. గడువు ముగిసిన అనంతరం వివరాల నమోదు అవకాశం ఉండకపోవచ్చని అధికారులు తెలిపారు. అలాగే, పైన పేర్కొన్న ఏడు రకాల సన్న వరి విత్తనాలను సొంతంగా సమకూర్చుకుని సాగు చేసిన రైతులు కూడా తమ వివరాలను సంబంధిత వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు. కాబట్టి సన్న రకం వరి సాగు చేస్తున్న రైతులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని, గడువులోగా తమ విత్తనాల వివరాలను నమోదు చేయించుకుని ప్రభుత్వం అందించే క్వింటాలుకు రూ.500 బోనస్‌ను పొందాలని మండల వ్యవసాయ శాఖ అధికారులు కోరారు.



## 21 టన్నుల అక్రమ రేషన్ బియ్యం పట్టివేత.. నలుగురు అరెస్ట్

**జనంసాక్షి,మిర్యాలగూడ :** 21 క్వింటాల రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి రీ పాలిష్ చేసి అమ్మడానికి సిద్ధం చేసి పోలీస్ లకి పట్టుబడిన సంఘటన మిర్యాలగూడ రూరల్ పరిధిలో చోటుచేసుకున్నది. రూరల్ ఎస్సై ఎం. లక్ష్మయ్య తెలిపిన వివరాల ప్రకారం గురువారం సాయంత్రం అవంతీపురం గ్రామ శివారులో ని శ్రీ లక్ష్మీ గణపతి ఆగ్రో ప్రొడక్ట్స్ రైస్ మిల్లు లో తనిఖీ నిర్వహించారు. ఈ తనిఖీ లో రేషన్ బియ్యం అక్రమంగా కొనుగోలు చేసి ఓ రైస్ మిల్లుకి తరలించి, పాలిష్ చేసి ఇతర బస్తాలలో నిల్వ చేసి విక్రయించేందుకు సిద్ధం చేసినట్లు పోలీస్ లు గుర్తించారు. 42 సంచుల్లో, ఒక్కో సంచి 50 కిలోల చొప్పున ఉన్న సుమారు 21 టన్నులరేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. అందుకు సంబంధించిన నలుగురిని అరెస్ట్ చేశారు.

ఈ కేసులో ఎ-1 సోమ రామకృష్ణ, ఎ-2 చిమ్మట వెంకన్న, ఎ-3 చిమ్మట లోకేష్, ఎ-4 సయ్యద్ నదీమ్ లను అరెస్ట్ చేశారు. దర్యాప్తులో ఎ-1 వివిధ తెల్ల రేషన్ కార్డుదారుల నుంచి రేషన్ బియ్యాన్ని తక్కువ ధరకు కొనుగోలు చేసి రైస్ మిల్లులకు తరలిస్తున్నట్లు, ఎ-2, ఎ-3లు బియ్యాన్ని పాలిష్ చేసి రీప్యాకింగ్ చేయడంలో సహకరిస్తున్నట్లు, ఎ-4 డ్రైవర్‌గా బియ్యాన్ని రవాణా చేస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. ఎ-1 సోమ రామకృష్ణపై గతంలోనే రేషన్ బియ్యం అక్రమ రవాణా, వ్యాపారానికి సంబంధించి వివిధ పోలీస్ స్టేషన్లలో 13 కేసులు నమోదైనట్లు దర్యాప్తులో వెల్లడైంది. రేషన్ బియ్యాన్ని అక్రమంగా కొనుగోలు చేయడం, నిల్వ చేయడం, రవాణా చేయడం లేదా ఇతర విధాలుగా దుర్వినియోగం చేసే వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.



# చాడలో నూతన పాఠశాల భవనం ప్రారంభం

ఘనంగా ప్రారంభించిన ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య

చాడా ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్వర్గీయ మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం నిర్మాణం

దాతల సహకారం అభినందనీయమని కొనియాడిన ఎమ్మెల్యే






**మోటకొండూరు, ఆగస్టు 27(జనంసాక్షి):** యాదాద్రి భువనగిరి జిల్లా మోటకొండూరు మండలం చాడ గ్రామంలో స్వర్గీయ మోహన్ రెడ్డి జ్ఞాపకార్థం 'చాడా ఫౌండేషన్' ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన పాఠశాల భవనాన్ని గురువారం తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య ఘనంగా ప్రారంభించారు. ప్రారంభోత్సవం అనంతరం ఆయన పాఠశాలలోని తరగతి గదులను, విద్యార్థులకు కల్పించిన వసతులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య మాట్లాడుతూ.. విద్యార్థులకు మెరుగైన వసతులు కల్పించేందుకు దాతలు ముందుకు వచ్చి నూతన భవనం నిర్మించడం ఎంతో అభినందనీయమన్నారు. గ్రామీణ ప్రాంతాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల అభివృద్ధికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకరిస్తే విద్యా ప్రమాణాలు మరింత మెరుగుపడతాయని ఆయన అభిప్రాయపడ్డారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు ఆహ్లాదకరమైన, సురక్షితమైన వాతావరణం అందించాల్సిన బాధ్యత అందరిపైనా ఉందన్నారు. పాఠశాల నిర్మాణానికి విశేషంగా సహకరించిన చాడా ఫౌండేషన్ సభ్యులను, మోహన్ రెడ్డి కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. విద్యార్థులు కష్టపడి చదివి ఉన్నత లక్ష్యాలను చేరుకోవాలని, తల్లిదండ్రులకు, గ్రామానికి, సమాజానికి మంచి పేరు తీసుకురావాలని ఆయన ఆకాంక్షించారు. విద్యా రంగానికి రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందని, ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు నిరంతరం కృషి చేస్తామని ఈ సందర్భంగా ఆయన స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఆకుల శ్రీను ,పలు గ్రామాల ప్రజాప్రతినిధులు, విద్యాశాఖ అధికారులు, చాడా ఫౌండేషన్ సభ్యులు, ఉపాధ్యాయులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై ప్రయాణం

## సిపిఎం మండల కార్యదర్శి, సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం

## గుంతలను వెంటనే మరమ్మతు చేయాలని ఆర్ అండ్ బి అధికారులకు వినతి

రామన్నపేట, ఆగస్టు 27 (జనంసాక్షి): రామన్నపేట?పల్లెపహాడ్ ప్రధాన రహదారి ప్రమాదకరంగా మారిందని, పెద్ద పెద్ద గుంతలు ఏర్పడి ప్రజలు ప్రాణాలు అరచేతిలో పెట్టుకొని రోడ్డుపై ప్రయాణంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సీపీఎం మండల కార్యదర్శి, మునిపంపుల గ్రామ సర్పంచ్ బొడ్డుపల్లి వెంకటేశం అన్నారు. రహదారిపై ఏర్పడిన గుంతలను వెంటనే మరమ్మతులు చేసి ప్రజలు, వాహనదారుల సమస్యను పరిష్కరించాలని సీపీఎం గ్రామ శాఖ ఆధ్వర్యంలో గురువారం ఆర్ అండ్ బీ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ.. రామన్నపేట?పల్లెపహాడ్ ప్రధాన రహదారి గుండా నిత్యం వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. మునిపంపుల గ్రామంలో రహదారి పలుచోట్ల పూర్తిగా దెబ్బతిని పెద్ద గుంతలు ఏర్పడ్డాయని, వర్షాలు కురిసినప్పుడు గుంతల్లో నీరు నిలిచి ప్రమాదాలు జరిగే పరిస్థితి నెలకొందన్నారు.ప్రత్యేకంగా ద్విచక్ర వాహనదారులు, పాదచారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. రాత్రి వేళల్లో గుంతలు కనిపించక ప్రమాదాల బారిన పడే అవకాశం ఉందన్నారు.



ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకొని అధికారులు తక్షణమే స్పందించి గుంతలను పూడ్చడంతో పాటు రహదారికి శాశ్వత మరమ్మతులు చేపట్టాలని డిమాండ్ చేశారు.రహదారి మరమ్మతుల విషయంలో నిర్లక్ష్యం చేస్తే ప్రజలతో కలిసి సమస్య పరిష్కారం కోసం ఆందోళన చేపడతామని ఆయన హెచ్చరించారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం సీపీఎం నిరంతరం ప్రజల పక్షాన పోరాడుతుందని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కమిటీ సభ్యుడు తోలుపునూరి శ్రీనివాస్,శాఖ కార్యదర్శి తాళ్లపల్లి జితేందర్, నాయకులు మేడి ముకుంద, ఉంద్రాతి నర్సింహా,జోగుల శ్రీనివాస్,కుక్కడపు స్వామి, పొన్న ఉప్పలయ్య, ఉయ్యాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



చౌటుప్పల మద్దెలమ్మ అమ్మవారి పదవ వార్షిక బోనాల మహోత్సవం

చౌటుప్పల ఆగస్టు 27(జనంసాక్షి) మున్సిపాలిటీలోని మణికంఠ నగర్ లో ప్రతిష్టించిన శ్రీ శ్రీ శ్రీ మద్దెలమ్మ అమ్మవారి పదవ వార్షిక బోనాల మహోత్సవ కార్యక్రమం గురువారం అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రీ మార్కండేయ స్వామి దేవాలయం నుండి అమ్మవారికి మహిళలు బోనాలతో బొడ్రాయి చుట్టూ తిరిగి రామాలయం పురవీధుల గుండా వెళ్లి శ్రీ శ్రీ మద్దెలమ్మ అమ్మవారికి బోనాలు సమర్పించడం జరిగింది. అనంతరం భక్తులకు అన్నప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. మద్దెలమ్మ అమ్మవారి బోనాల మహోత్సవాన్ని పురస్కరించుకొని సాయంత్రం చౌటుప్పల కర్కీరు వద్ద శ్రీ శ్రీ మద్దెలమ్మ మాత నాట్య కళామండలి వారి సౌజన్యంతో సారంగధర యక్షగానం ప్రదర్శన నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి దేవాలయ శాశ్వత వ్యవస్థాపక అధ్యక్షులు గోశిక స్వామి, బడుగు లక్ష్మయ్య, బడుగు జయప్రకాష్, గోశిక అంజయ్య, వనం రాజు, చిక్క నరహరి, గోశిక కరుణాకర్, పెద్ది కృష్ణ, కందగట్ల ఆనంద్, పిల్లలమర్రి యాదగిరి, కర్నాటి శ్రీనివాసులు, కడవేరు శంకరయ్య, గోశిక పాండు, శాంతి శ్రీ, కోడి వనిత, బడుగు పావని, గడ్డం పద్మశ్రీ, గోశిక సత్యనారాయణ, బడుగు శ్రీరాములు, గోశిక రవి, గజం బృహ మహర్షి, కోడి నరసింహ, పాల్గొనడం జరిగింది.

## బొమ్మలరామారం మండలంలో

# సర్ గ్రామ సభల్లో పాల్గొన్న ఎమ్మెల్యే బీర్ల

### సమగ్ర సవరణ పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు ఆదేశం



బొమ్మలరామారం ఆగస్టు 27 (జనంసాక్షి) సమగ్ర సవరణ పారదర్శకంగా చేయాలని ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల ఐలయ్య అధికారులకు సూచించారు. గురువారం మండలంలోని రంగాపూర్, రామస్వామి తండా గ్రామాల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా నిర్వహించిన గ్రామ సభల్లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.ఈ సందర్భంగా గ్రామ సభల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియకు సంబంధించిన అంశాలను ఆయన పరిశీలించారు. అర్హులైన ప్రతి ఒక్కరి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా, ఎలాంటి పొరపాట్లు లేకుండా జాబితా సవరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. ప్రజలు కూడా తమ ఓటు హక్కుకు సంబంధించిన వివరాలను పరిశీలించి, అవసరమైన సవరణలు ఉంటే సంబంధిత అధికారుల దృష్టికి తీసుకురావాలని కోరారు.అనంతరం ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య మాట్లాడుతూ..ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి అర్హత కలిగిన పౌరుడి పేరు ఓటర్ల జాబితాలో ఉండేలా చూడాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)లో భాగంగా అధికారులు గ్రామాల్లో నిర్వహిస్తున్న గ్రామ సభలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఓటర్ల జాబితాలో తమ పేరు, వయస్సు, చిరునామా తదితర వివరాలను పరిశీలించుకోవడంతో పాటు, అర్హత ఉన్నప్పటికీ జాబితాలో పేరు లేని వారు సంబంధిత అధికారులను సంప్రదించి అవసరమైన దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. మరణించిన వారు, శాశ్వతంగా వలస వెళ్లిన వారు లేదా ఇతర కారణాలతో అనర్హులైన వారి పేర్లపై కూడా అధికారులు నిబంధనల ప్రకారం పరిశీలన చేపట్టాలని తెలిపారు.గ్రామ సభల ద్వారా ఓటర్ల జాబితాలోని వివరాలపై ప్రజలకు పూర్తి అవగాహన కల్పించాలని అధికారులకు సూచించిన ఎమ్మెల్యే, ఎలాంటి పొరపాట్లు లేకుండా పారదర్శకంగా సవరణ ప్రక్రియను పూర్తి చేయాల్సిన అవసరం ఉందన్నారు గ్రామీణ ప్రాంతాల్లో మౌలిక వసతుల కల్పనతో పాటు ప్రజలకు అవసరమైన అభివృద్ధి కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నామని పేర్కొన్నారు.ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ అందేలా కృషి చేస్తున్నామని ఎమ్మెల్యే తెలిపారు. అర్హత ఉన్న ఏ ఒక్కరూ ప్రభుత్వ సంక్షేమ పథకాల నుంచి దూరం కాకుండా సంబంధిత అధికారులతో సమన్వయం చేసుకుంటూ సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామాల అభివృద్ధితో పాటు ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని, ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తామని బీర్ల అయిలయ్య స్పష్టం చేశారు.

## బుల్లెట్ ట్రైన్ మొదటి అలైన్మెంట్ ఇచ్చే వరకు ఉద్యమం ఆగదు



సూర్యాపేట(జనంసాక్షి):మొదటి అలైన్మెంట్ ప్రకారం జాతీయ రహదారి65 వెంట బుల్లెట్ ట్రైన్ కొనసాగించాలన్న ప్రతిపాదనలు అమలయ్యే వరకు ఉద్యమం కొనసాగుతుందని ఐద్వా రాష్ట్ర జనరల్ సెక్రటరీ మల్లు లక్ష్మి అన్నారు.బుల్లెట్ ట్రైన్ సాధన అఖిలపక్ష పోరాట కమిటీ దీక్షల్లో 14వ రోజు గురువారం ఐద్వా ఆధ్వర్యంలో మహిళలు పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రజల అవసరాలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం పని చేయాలి తప్ప నాయకుల స్వప్రయోజనాల కోసం పని చేయవద్దన్నారు.లక్షల కోట్లతో మంజూరైన బుల్లెట్ ట్రైన్ లక్షల మంది రోజు ప్రయాణించే నేషనల్ హైవే 65 మీదుగా కొనసాగించాల్సి ఉండగా, బుల్లెట్ ట్రైన్ అవసరం లేని చోట నుండి తరలించే విధానాన్ని విరమించుకోవాలని అన్నారు. సూర్యాపేట నకిరేకల్ కోదాడ చౌటుప్పల్ ప్రాంతాల్లో జరుగుతున్న బుల్లెట్ ట్రైన్ దారిమళ్ళింపు వ్యతిరేక ఉద్యమాన్ని పట్టించుకోకుండా నిర్లక్ష్యం చేస్తే ప్రజా ఉద్యమం తీవ్ర స్థాయికి చేరుతుందని అన్నారు.ప్రజలకు అవసరమైన ఈబుల్లెట్ ట్రైన్ జాతీయ రహదారి వెంట కొనసాగించేలా ప్రభుత్వం నిర్ణయించాలని కోరారు.ఈ దీక్షల్లో జ్యోతి, వెంకటచంద్ర సైదమ్మ, రజిత,రమాదేవి, విజయలక్ష్మి నాగమణి, కిజాబీ, లక్ష్మమ్మ, సైదమ్మ సుభద్ర, అమృతమ్మ, జానమ్మ తదితరులు పాల్గొన్నారు.బుల్లెట్ ట్రైన్ సాధన కోసం గురువారం ఐద్వా మహిళా సంఘాలు దీక్షల్లో పాల్గొనగా ఈ దీక్షకు పలువురు సంఘీభావం తెలిపారు.మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్ గౌడ్, బిఆర్ఎస్ ఫ్లోర్ లీడర్ నాగార్జున ఆధ్వర్యంలో కౌన్సిలర్లు, మాజీ మున్సిపల్ చైర్మన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పెద్దిరెడ్డి రాజా, తండు శ్రీనివాస్ యాదవ్, రమణాచారి,డేవిడ్ కుమార్ బూర వెంకటేశ్వర్లు, చలమల నరసింహా, యాదగిరిరావు, వేల్పుల వెంకన్న, నరసింహా, జర్నలిస్టు కందుకూరి యాదగిరి, భయ్యా మల్లయ్య యాదవ్, వెంకన్న, నాగయ్య, సంతోష్, సభ్యులు తదితరులు సంఘీభావం తెలిపారు.

# పీఆర్సీ అమలుతో పాటు పెండింగ్ డీఏలను మంజూరు చేయాలి

సూర్యాపేట (జనంసాక్షి): తెలంగాణ రాష్ట్ర ఉద్యోగ ఉపాధ్యాయ పెన్షనర్ల ఐక్యవేదిక రాష్ట్ర కమిటీ అధ్యక్షులు మారం జగదీష్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ఇచ్చిన దశల వారి పోరాటంలో భాగంగా గురువారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ ధర్నా కార్యక్రమానికి జేఏసీ జిల్లా బాధ్యులు దున్న శ్యామ్, సెక్రటరీ జనరల్ భూపాల్ రెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. జిలా వ్యాప్తంగా ఉన్న ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల సంఘాల నాయకులు భారీగా తరలివచ్చారు.తమ సమస్యలు పరిష్కరించాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ సందర్భంగా వివిధ సంఘాల నాయకులు మాట్లాడుతూ పీఆర్సీ అమలుతో పాటు పెండింగ్ డీఏలను మంజూరు చేయాలని అన్నారు.సీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధించాలని కోరారు. పెండింగ్ బిల్లులు మంజూరు చేయడంతో పాటు హెల్త్ కార్డులు సక్రమంగా అమలు చేయాలన్నారు. ఉపాధ్యాయుల బదిలీలు చేపట్టాలని, పదోన్నతులు పూర్తి చేయాలన్నారు.వీబీ జీ రామ్ ఉద్యోగులకు ప్రకటించిన పే స్కేల్స్ లను అమలు పరచాలన్నారు. సెప్టెంబర్ 10న ఇందిరాపార్క్ వద్ద జరగనున్న మహాధర్నాను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో అడిషనల్ సెక్రటరీ జనరల్ తంగెళ్ల జితేందర్ రెడ్డి, రాష్ట్ర జేఏసీ నాయకులు రాధాకృష్ణ, కో చైర్మన్లు ఎన్.సోంబాబు, పి.వీరన్న, షేక్.ఉమర్, నిమ్మల శ్రీనివాస్,సీతారామయ్య, జహంగీర్, నాగేశ్వరరావు, మన్నెం యాదగిరి, బి.పాండు నాయక్, కోడిరెక్క నాగేందర్, లక్కపాక ప్రవీణ్ కుమార్, ఎస్.రవికుమార్, నాయిని ఆకాష్ వర్మ, మడిపడగ సైదులు, డి.బాలు నాయక్, బంధం వెంకటేశ్వర్లు, సుంకరి అనిత, పద్మావతి, వెంకటరమణ, పి శ్రీనివాస్ రెడ్డి,వీబీ జీ రామ్ ఉద్యోగులు రామకృష్ణారెడ్డి, శ్రీరాములు, నాగయ్య,సుధీర్ రెడ్డి, పంచాయతీ కార్యదర్శుల సంఘం ఇంద్ర బాబు, శ్రీకాంత్ రెడ్డి, జడ్పీ ఉద్యోగుల సంఘం శ్రీధర్ నాయుడు, ఎస్సీ ఎస్టీ ఉపాధ్యాయ సంఘం అధ్యక్షులు అయోధ్య, ఇరిగేషన్ ఉద్యోగుల సంఘం భూపతి వెంకటయ్య, రాష్ట్ర నాయకులు డాక్టర్ బట్టు గోపి,రె?పాక లింగయ్య, పబ్బతి వెంకటేశ్వర్లు, మర్యాద సైదులు, వివిధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.



# సన్న వడ్లకు రూ.500 బోనస్.. సెప్టెంబర్ 10లోగా నమోదు తప్పనిసరి

## చండూరు మండల వ్యవసాయ అధికారి పి. మల్లేష్




**చండూరు, ఆగస్టు 27 (జనంసాక్షి)** సన్న వడ్ల సాగును ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం ఎంపిక చేసిన ఏడు రకాల సన్న వరి పంటలకు క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ అందించనున్నట్లు చండూరు మండల వ్యవసాయ అధికారి పి. మల్లేష్ తెలిపారు. బోనస్ పొందాలంటే రైతులు సెప్టెంబర్ 10, 2026లోగా తప్పనిసరిగా తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఆయన సూచించారు.ప్రభుత్వం గుర్తించిన బీపీటీ-5204 (సాంబమసూరి), ఆర్ఎన్ఆర్- 15048 (తెలంగాణ సోనా), హెచ్ఎంటీ సోనా, జై శ్రీరామ్, కేఎన్ఎం-1638 (కూనారం సన్నలు), డబ్ల్యూజీఎల్-44 (సిద్ధి), కేఎన్ఎం- 7715 రకాల వరిని సాగు చేసిన రైతులు బోనస్‌కు అర్హులని పేర్కొన్నారు.దుకాణాల్లో విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత విత్తన దుకాణాల వద్దే తమ వివరాలను నమోదు చేయించుకోవాలని సూచించారు. సొంత విత్తనాలను ఉపయోగించి సాగు చేసిన రైతులు తమ పరిధిలోని వ్యవసాయ విస్తరణాధికారులను (ఏఈఓ) సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు.చండూరు మండలంలోని అన్ని గ్రామాల రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, నిర్ణీత గడువులోగా రిజిస్ట్రేషన్ పూర్తి చేసుకోవాలని పి. మల్లేష్ కోరారు. సెప్టెంబర్ 10లోగా నమోదు చేసుకోని రైతులకు ప్రభుత్వం అందించే క్వింటాకు రూ.500 బోనస్ వర్తించదని స్పష్టం చేశారు.

# రహదారి భద్రత మన అందరి బాధ్యత

### హైవేలపై నిరంతర తనిఖీలు

### రహదారుల పక్కన, సర్వీస్ రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలుపవద్దు : జిల్లా ఎస్పీ కె.నరసింహ



**సూర్యాపేట (జనంసాక్షి):** జాతీయ రహదారులపై, జిల్లాలోని ఇతర ప్రధాన రహదారుల వెంట నిబంధనలకు విరుద్ధంగా, ఎక్కడపడితే అక్కడ అనుమతి లేకుండా వాహనాలను నిలిపే వారిపై సూర్యాపేట జిల్లా పోలీసులు కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కె.నరసింహ తీవ్రంగా హెచ్చరించారు.నిబంధనలు ఉల్లంఘించిన లారీ యజమానులకు భారీగా జరిమానాలు విధిస్తారని అన్నారు. రహదారుల వెంట హోటల్స్, పంక్చర్ షాప్స్, టి దుకాణాలు, ఇతర వ్యాపారాలు చేసే వారు బాధ్యతగా ఉండాలని, జాగ్రత్తలు పాటించాలని పేర్కొన్నారు.రహదారుల పక్కన, సర్వీస్ రోడ్లపై ఇష్టానుసారంగా వాహనాలు నిలపడం వల్ల వెనుక నుంచి వచ్చే వాహనాలు ఢీకొని ఘోర రోడ్డు ప్రమాదాలు సంభవిస్తున్నాయన్నారు. ఎంతో మంది ప్రాణాలు కోల్పోతున్నారని అన్నారు.హైవేలపై తనిఖీలు నిరంతరం కొనసాగుతాయని తెలిపారు.నిబంధనలు పాటించకుండా వాహనాలు పార్క్ చేస్తే మోటార్ వాహనాల చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని అన్నారు.వాహనదారులు, లారీ డ్రైవర్లు ఇతర వాహనాలను రోడ్డుకు దూరంగా నిలుపుకోవాలన్నారు.రహదారుల వెంట ఎక్కడపడితే అక్కడ వాహనాలు నిలిపితే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.రోడ్డు ప్రమాద రహిత సూర్యాపేట జిల్లా నిర్మాణానికి ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఉండాలని కోరారు.

## రైతు వేదికలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

### వరికి ప్రత్యామ్నాయంగా మెట్ట పంటలు సాగు చేయాలి

### వ్యవసాయ అధికారులు

**మాడుగులపల్లి ఆగస్టు 27(జనంసాక్షి):** రోజురోజుకూ పడిపోతున్న భూగర్భ జలాలను దృష్టిలో ఉంచుకుని రైతులు వరికి ప్రత్యామ్నాయంగా తక్కువ నీటి అవసరం ఉండే మెట్ట పంటలను సాగు చేసి కరువును జయించాలని వ్యవసాయ అధికారులు సూచించారు మాడ్గులపల్లి వ్యవసాయ శాఖ, ఆత్మ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం కన్నెకల్ రైతు వేదికలో ఆర్పిఎల్ ఆధారిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి కెవికె కంపసాగర్ శాస్త్రవేత్త డాక్టర్ శ్రీధర్, మండల వ్యవసాయ అధికారి శివరాం కుమార్, వ్యవసాయ విస్తరణ అధికారి సంతోష హాజరై రైతులకు పలు వ్యవసాయ అంశాలపై పూర్తి స్థాయిలో అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ వర్షాభావ పరిస్థితుల వల్ల నీటి లభ్యత తగ్గి బోర్ బావులు ఎండిపోయే ప్రమాదం ఉందన్నారు అందుకే రైతులు స్థానిక వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ పంటలను ఎంచుకోవాలని కోరారు ముఖ్యంగా కంది, పెసర, మినుము, నువ్వులు, జొన్న, సజ్జ, ఆముదం, ఉలువలు వంటి మెట్ట పంటలను సాగు చేయడం ద్వారా తక్కువ నీటితో అధిక లాభాలు పొందవచ్చని వివరించారు. అనంతరం గ్రామంలోని వరి, పత్తి పంట పొలాలను స్వయంగా పరిశీలించి పైరు నిర్వహణపై రైతులకు తగు సూచనలు అందించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

## డిగ్రీ కళాశాలలో మహిళా సమానత్వ దినోత్సవం

**రామన్నపేట, ఆగస్టు 27 (జనంసాక్షి):** రామన్నపేట ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మహిళా సాధికారత విభాగం ఆధ్వర్యంలో గురువారం మహిళా సమానత్వ దినోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన కళాశాల ప్రధానాచార్యులు ఆచార్య రాహత్ ఖానం మాట్లాడుతూ మహిళలు పురుషులతో పాటు సమానంగా గౌరవించబడ్డప్పుడే ఆ సమాజం సుభిక్షంగా ఉంటుందని, ఎక్కడైతే స్త్రీలు గౌరవించబడతారో అక్కడ దేవతలు ఉంటారని శాస్త్రాలు చెబుతున్నాయి కావున స్త్రీలను ఆదరించవలసిన అవసరం ఉందని అన్నారు. పోటీ ప్రపంచంలో ప్రస్తుతం పురుషులతో పాటు స్త్రీలు కూడా సమానమైన హక్కుల కోసం పోరాటం చేస్తున్నారని, ప్రతి రంగంలో స్త్రీలు రాణిస్తున్నారని కావున స్త్రీల పట్ల ఎలాంటి వివక్షను కలిగి ఉండకుండా పురుషులతో పాటు సమానంగా స్త్రీలను కూడా చూడాలని అన్నారు. ముఖ్యంగా తల్లిదండ్రులు పిల్లల పెంపకంలో ఎలాంటి వివక్షను చూపరాదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్. రత్న మంజుల, ఐక్యూఏసి కోఆర్డినేటర్ డాక్టర్ ఎన్.లక్ష్మి నీలిమ,మహిళా సాధికారత విభాగం కన్వీనర్ ఎం. అనితతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## సామాజిక ఐక్యతకు ప్రతీక రాఖీ పండుగ :సరస్వతి విద్యాలయం కరస్పాండెంట్ తొర్ర విష్ణు

**ఆత్మకూరు , ఆగస్ట్ 27 జనంసాక్షి**
యాదాద్రి భువనగిరి జిల్లా ఆత్మకూరు మండల కేంద్రంలోని సరస్వతి విద్యాలయంలో ఘనంగా రాఖీ పౌర్ణమి వేడుకలు నిర్వహించారు . అమ్మాయిలు సోదర భావంతో అబ్బాయిలకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు . ఈ సందర్భంగా ప్రముఖ విద్యావేత్త , సరస్వతి విద్యాలయం కరస్పాండెంట్ తొర్ర విష్ణు మాట్లాడుతూ సామాజిక ఐక్యతకు ప్రతీక రాఖీ పండుగ అని అన్నారు . విద్యార్థులకు , ఉపాధ్యాయులకు రాఖీ పౌర్ణమి శుభాకాంక్షలు తెలిపారు . ఈ రాఖీ పండుగ కేవలం కుటుంబ సభ్యులకు మాత్రమే కాదని సోదర సోదరి భావంతో కలిసి మెలిసి వున్న కుటుంబాలకు , బంధుమిత్రులకు , ఆత్మీయులకు ఎవరికైనా రాఖీ కట్టి శుభాకాంక్షలు తెలుపవచ్చని అన్నారు . సోదర భావాన్ని పెంచే శక్తి కలిగి ఉన్న ఏకైక పెద్ద పండుగ రాఖీ పౌర్ణమి అని అన్నారు . ఈ కార్యక్రమంలో సరస్వతి విద్యాలయం ప్రిన్సిపాల్ పంజాల నర్సయ్య గౌడ్ , వైస్ ప్రిన్సిపాల్ కొమరిశెట్టి ఐలయ్య , ఉపాధ్యాయులు విష్ణు ,యాసిన్, సుధాకర్ , లలిత , సంతోష , మహేశ్వరి , సంధ్య , మాధవి , రేణుక , లక్ష్మి , లావణ్య , స్వాతి , రోజా , విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు

# నూతనకల్ లో యువజన కాంగ్రెస్ సమీక్ష సమావేశం



**నూతనకల్ ఆగస్టు27(జనంసాక్షి)** తుంగతుర్తి నియోజకవర్గం నూతనకల్ మండల కేంద్రంలో యువజన కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన జిల్లా,నియోజకవర్గ, మండల సమీక్ష సమావేశ కార్యక్రమానికి జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఎలిమినేటి అభినయ్,తుంగతుర్తి యువజన కాంగ్రెస్ అధ్యక్షులు కోరుకొప్పుల నరేష్ గౌడ్ గురువారం ముఖ్య అతిథిలుగా హాజరై యువజన కాంగ్రెస్ చేపట్టవలసిన కార్యక్రమాలకు దిశా నిర్దేశం చేసి,పలు అంశాలపై చర్చించడం జరిగింది. దీనిలో భాగంగా యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీలు, మండల కమిటీలు నాయకులందరికీ భాగస్వామ్యంతో కమిటీలు వేయాలని, యూత్ కాంగ్రెస్ నాయకులకు రాబోయే ఎన్నికల్లో నామినేటెడ్ పదవులలో భాగస్వామ్యం కల్పించాలని వారు కోరారు.అదేవిధంగా గ్రామస్థాయిలో ప్రభుత్వ పథకాలను, కాంగ్రెస్ ప్రజా పాలన గురించి ప్రజలకు వివరించాలని కోరారు పార్టీకి పనిచేస్తేనే గుర్తింపు లభిస్తుందని అన్నారు.ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు శ్రావ్యసుధీర్ రెడ్డి, విజయ భాస్కర్ సూర్యాపేట,కోదాడ ,హుజూర్ నగర్ నియోజకవర్గ అధ్యక్షులు జావిద్ బేగ్,అజీమ్ , నూతనకల్ మండల యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు పసుల అశోక్ యాదవ్,వివిధ మండలాల అధ్యక్షులు సమీర్, అనిల్, నరేష్,యూత్ కాంగ్రెస్ నాయకులు పాల్వాయి కార్తీక్,బోల్క సైదులు యాదవ్,కొరివి గంగయ్య, మరికంటి అశోక్, ఉప్పల మురళి, శ్రీధర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# మానవత్వం చాటుకున్న చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి

- ◆మానస విద్యామందిర్ మాజీ ఉపాధ్యాయుడు సంతోష్ మృతికి ఘన నివాళి
- ◆బాధిత కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయం
- ◆సంతోష్ భార్యకు పాఠశాలలో ఉద్యోగం, కుమారుడికి ఉచిత విద్య
- ◆చైర్మన్ ఉదారతపై సర్వత్రా ప్రశంసల వర్షం



**మోటకొండూరు, ఆగష్టు 27(జనం సాక్షి):** ఆపదలో ఉన్న తమ పాఠశాల ఉపాధ్యాయుడి కుటుంబానికి నేనున్నాను అంటూ మానస విద్యామందిర్ హైస్కూల్ ( బిఎంఆర్ఎస్ ) చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి తన ఉదార స్వభావాన్ని చాటుకున్నారు. అనారోగ్యంతో అకాల మరణం చెందిన పాఠశాల మాజీ మ్యాథ్స్ టీచర్ కుటుంబానికి రూ. 50 వేల ఆర్థిక సాయంతో పాటు, ఆ కుటుంబానికి శాశ్వత భరోసానిచ్చి అందరికీ ఆదర్శంగా నిలిచారు. వివరాల్లోకి వెళితే.. మోటకొండూరు మండలంలోని ముత్తిరెడ్డిగూడెం గ్రామంలో గల మానస విద్యామందిర్ హైస్కూల్‌లో నిరునేముల సంతోష్ గతంలో మ్యాథ్స్ టీచర్‌గా పనిచేశారు. ఆయన అనారోగ్యంతో మంగళవారం మృతి చెందారు. సంతోష్ మృతికి సంతాపంగా బుధవారం పాఠశాల ప్రార్థనా సమయంలో ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు రెండు నిమిషాల పాటు మౌనం పాటించి ఆయనకు అశ్రు నివాళులు అర్పించారు.

**మల్లారెడ్డి పెద్ద మనసు.. సంతోష్ కుటుంబానికి కొండంత అండ**

సంతోష్ అకాల మరణంతో పెద్ద దిక్కును కోల్పోయి శోకసంద్రంలో ఉన్న ఆ కుటుంబాన్ని ఆదుకోవడానికి చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి తక్షణమే స్పందించారు. ఆ కుటుంబం రోడ్డున పడకూడదన్న సదుద్దేశంతో ఆయన ఆ కుటుంబానికి తక్షణ అవసరాల నిమిత్తం రూ. 50 వేల రూపాయల ఆర్థిక సాయం, ఆ కుటుంబానికి శాశ్వత ఆర్థిక భద్రత కల్పించేందుకు సంతోష్ భార్యకు తమ పాఠశాలలోనే ఉద్యోగం కల్పిస్తామని ప్రకటించారు. సంతోష్ కుమారుడి భవిష్యత్తుకు ఎలాంటి ఆటంకం కలగకుండా, తమ పాఠశాలలోనే అతనికి పూర్తిగా ఉచితంగా విద్యను అందిస్తామని హామీ ఇచ్చారు. కష్టకాలంలో ఉన్న ఒక ఉపాధ్యాయుడి కుటుంబానికి ఇంతటి అండగా నిలిచిన పాఠశాల చైర్మన్ బొప్పిడి మల్లారెడ్డి గొప్ప మనసుపై స్థానికులు, తోటి ఉపాధ్యాయులు, విద్యార్థుల తల్లిదండ్రులు ప్రశంసల వర్షం కురిపిస్తున్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్స్పండెంట్ నిమ్మ శేఖర్ రెడ్డి, ప్రిన్సిపాల్ సచిన్, పిఈటి శ్రీలత, నవనీతఅనిఫ్,ఉపాధ్యాబృందం తదితరులు పాల్గొన్నారు.

